ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

తూర్పుగోదావరి జిల్లా వార్తలు

ఆదివారం 17 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.22
సహరి(సోమ) ఉ.4.48

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	36.0	23.0

మోగిన భేరీ!









కోడ్ వచ్చిన వెంటనే రాజమహేంద్రవరంలో అధికార వైసీపీ, టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు.. ఇంకా సీఎం జగన్ ఫ్లెక్సీలు మాత్రం తీయలేదు..

- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ
- 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- మే 13న పోలింగ్..జూన్ 4న లెక్కింపు
- జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికలకు 9809 మంది సిబ్బంది
- తుది ఓటర్ల జాబితా విడుదల

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నగారా మోగింది.. ఎపుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎన్నికల షెడ్యూల్ జారీ అయింది. శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ కానుంది.ఏప్రిల్ 25వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరి స్తారు. 26న పరిశీలిస్తారు.29వ తేదీ నామినేషన్ల ఉపసంహ రణకు చివరి తేదీ. మే 13న జిల్లాలో పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్లు లెక్కిస్తారు. ఇదీ ఎన్నికల ప్రక్రియ. జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరార య్యారు. రాజమహేంద్రవరం లోక్‌సభ టీడీపీ-జనసేన- బీజేపీ ఉమ్మడి అభ్యర్థి మాత్రమే ఇంకా ఖరారు కావాల్సి ఉంది.జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికా రిగా ఉన్న జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత వ్యవహరిస్తు న్నారు. పోలింగ్‌కు 1569 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశా రు. అందులో 30 అతిసమస్యాత్మక, 306 సమస్యాత్మక కేంద్రాలు ఉండగా మిగతా 1263 సాధారణ కేంద్రాలుగా గుర్తించారు.ఎన్నికల నిర్వహణకు 9809 మంది ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569, అసిస్టెంట్ ప్రిసై డింగ్ ఆఫీసర్లు 1569,పోలింగ్ అధికారులు 6276,మైక్రో అబ్జర్వర్లు 395 మందిని సిద్ధం చేశారు. నన్నయ్యవర్సిటీలో రిసెప్షన్ కేంద్రం, నియోజకవర్గాలవారీ స్ట్రాంగ్‌రూమ్‌లు తదితర ఏర్పాట్లు చేశారు.

జిల్లా ఓటర్లు 16,05,762

మే 13న జరిగే ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధమైంది. తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 16,05,762 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 7,85,142 మంది, మహిళలు 8,20,515 మంది, థర్డ్ జండర్ 105 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 35,373 మంది ఎక్కువగా ఉన్నారు.ఇక జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా రాజమహేంద్రవరం రూరల్.. అత్యల్ప ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు నమోదైంది. ఓటర్ల తుది జాబితా ప్రకటించినప్పటికీ నామినేషన్లు చివరిరోజు వరకూ ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది.

నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్
రాజమండ్రిరూరల్	2,71,159	1,32,531	1,38,604	24
కొవ్వూరు	1,83,405	89,442	93,958	5
రాజమండ్రిసిటీ	2,60,360	1,25,639	1,34,663	58
గోపాలపురం	2,41,798	1,18,783	1,23,008	7
అనపర్తి	2,23,255	1,09,323	1,13,930	2
రాజానగరం	2,13,911	1,05,824	1,08,083	4
నిడదవోలు	2,11,874	1,03,600	1,08,269	5

రూ.50 వేలు మించి నగదు తీసుకెళితే సీజ్

- కటౌట్లు, హోర్డింగ్‌లు తొలగించాలి
- ఉద్యోగులు నేతలకు దూరంగా ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని.. వీటిని కచ్చితంగా అమలు చేయాలని, అందరూ పాటించాలని జిలా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత స్పష్టం చేశారు. కలెక్టరేట్ నుంచి శనివారం సార్వత్రిక ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సంబంధిత అన్ని విభాగాల అధికారులు,సిబ్బంది వెంటనే వారికి నిర్దేశించిన ఎన్నికల, అనుబంధ కార్యకలాపాలు చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని హెచ్చరించారు.ప్రతి వాహనానికి జీపీఎస్ ఏర్పాటు చేయడానికి జిల్లా రవాణా అధికారిని సంప్రదించాలన్నారు. స్టాస్టిటిక్ సర్వైవల్ బృందాలు, బోర్డర్ టీమ్స్ వెంటనే విధులు మొదలు పెట్టాలన్నారు. వ్యక్తిగతంగా ఎవరూ రూ.50 వేలుకు మించి నగదు తీసుకెళ్లడా నికి అనుమతి లేదని, ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తాలను తీసుకుని వెళితే సీజ్ చేస్తామన్నారు. మంత్రులు, రాజకీయ నేతల పాల్గొనే సమీక్షలు, సమావేశాలకు ప్రభుత్వ అధికారులు ,సిబ్బంది వ్యక్తిగతంగా కానీ, సమష్టిగా గానీ, హాజరు కా కూడదని,వారితో కలవకూడదన్నారు. కార్యాలయాల్లో మాత్రమే రాజకీయ పార్టీల ప్రతినిధులను అధికారిక విధుల కింద మాత్రమే కలవాలని స్పష్టం చేశారు.ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థుల విషయంలో కచ్చితంగా మార్గదర్శకాలు పాటించాలని, సైరన్ కలిగిన పైలెట్ కారుతో మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, పర్యటించకూడదని చెప్పారు.కోడ్ కారణంగా 24 గం టల్లో ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు తొలగించాలని ఆదేశించారు. రాబోయే 48 గంట ల్లోపు అన్ని చోట్లా ప్రభుత్వ ప్రకటనలు,హోర్డింగ్‌లు తొలగించాలని ఆదేశించారు. నిర్ణీత రుసుం చెల్లించి ప్రదర్శించిన వాటిని కొనసాగించవచ్చన్నారు. ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రకటలను మీడియాలో నిలిపివేయాలన్నారు. కేంద్ర, జిల్లా ఎన్నికల సంఘానికి నియమావళి ఉల్లంఘించినట్టు వచ్చిన ఫిర్యాదులు, ఇప్పటికే ప్రారంభించిన పనులు, ప్రారంభించని పనుల జాబితాపై 72 గంటల్లోపు నివేదిక అందజేయాలన్నారు. ప్రభుత్వ భవనా లపై,రాజకీయనేతలు చి త్రాలు, ఫొటోలు ఉండకూ డదన్నారు. మంత్రులకు ప్రభుత్వ అతిథి గృహాల్లో వసతి కల్పించకూడదని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సమయంలో ప్రభావాన్ని చూపడానికి ప్రయత్నిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాల మీద ప్రద ర్శించే ఫొటోలను మూసి ఉంచాలన్నారు. ఉపాధి హామీ పథకం చేపట్టే జాబ్‌కార్డ్ ఉపాధి అవకాశాలు కొనసాగించవచ్చని చెప్పారు.ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వర్తించి,మార్గదర్శకాలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ పి.జగదీశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన ఘటనలను దృష్టిలో ఉం చుకుని జాగ్రత్తగా విధులు నిర్వహించాలని చెప్పా రు.అభ్యర్థులు ఉపయోగించే వీడియో వాహనాలకు ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేశారు.



కోడ్ కూసిన రోజే...

రాజమహేంద్రవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల పవర్తనా నియమావళి శనివారం సాయంత్రం అమల్లోకి వస్తుందని తెలియడంతో వైసీపీ నాయకులు రోజు రోజంతా హడావుడిగా నియోజకవర్గాలను చుట్టేశారు. వైసీపీ సిటీ నియోజకవర్గ అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఉదయం నుంచీ తీరిక లేకుండా గడిపారు. 10, 41, 45, 46 వార్డుల్లో సీసీ, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు. రాజానగరం వైసీపీ అభ్యర్థి,సిట్టింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆ నియోజకవర్గంలో పలు శంకుస్థాపనలు చేశారు.సాయంత్రం వరకూ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. మంత్రి, రాజమహేంద్రవరం వైసీపీ రూరల్ అభ్యర్థి చెల్లుబోయిన వేణు తన నూతన కార్యాలయాన్ని ప్రారంభించి భోజనాలు పెట్టారు. 22 మంది ఆరోగ్యశ్రీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. నిడదవోలులో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు విలేకరులు ఒక్కొక్కరికీ కొత్త బట్టలు ఇచ్చి రూ.5 వేల నగదు అంద జేశారు. కోరుమామిడిలో వలంటీర్లకు రూ.3 వేలు విలువ చేసే వెండిగిన్నె అందజేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన తొలిరోజే వైసీపీ నాయకులు ఉల్లంఘించేశారు.



ఫ్యాన్‌కు పాత రెక్కలే..



తానేటి వనిత, సిహెచ్.వేణు గోపాలకృష్ణ, మార్గాని భరత్ రామ్, జక్కంపూడి రాజా, జి.శ్రీనివాస్ నాయుడు, సత్తి సూర్య నారాయణరెడ్డి, తలారి వెంకటరావు

ప్రజలు వ్యతిరేకించినా.. మళ్లీ సిట్టింగ్‌లకే..

- ఉమ్మడి జిల్లాలో 22 సీట్లు ప్రకటన
- నాలుగు స్థానాల్లో సిట్టింగ్‌లు ఔట్
- మిగిలిన సీట్లలో సిట్టింగ్‌లకే ఛాన్స్
- ముగ్గురు మంత్రుల్లో ఒకరి స్థానం మార్పు
- 12 స్థానాల్లో ఓసీలను నిలబెట్టిన వైసీపీ
- ఎస్సీలకు 5, బీసీలకు 4 స్థానాలే
- కాకినాడ పార్లమెంట్‌లో బీసీలకు నో ఛాన్స్
- రాజోలు సీటుపై రాపాక గోడు వినని వైసీపీ
- ఎంపీగా అయిష్టంగానే బరిలోకి
- ఆలస్యంగా వచ్చిన గొల్లపల్లికి టిక్కెట్
- రాపాకకు చెక్ పెట్టిన అధిష్ఠానం
- అమలాపురం ఎంపీకి అవమానం
- ఎక్కడా టిక్కెట్ కేటాయించని అధికార పార్టీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో అధికార వైసీపీ ఎట్టకేలకు అభ్యర్థులను ప్రకటించింది. ఓటమి భయంతో ఇన్నాళ్లు అనేక స్థానాల్లో ఎవరు బరిలో ఉంటారో తేల్చలేక సతమతమైన ఫ్యాన్ పార్టీ పలు స్థానాల్లో రాజీపడింది. అక్కడ అభ్యర్థులను మార్చాలని భావించినా ఎక్కడ మళ్లీ కొత్త తలనొప్పులు వస్తాయోనన్న భయంతో కొంత తగ్గింది. చేసేదిలేక అనేక స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే దాదాపు మొగ్గు చూపింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 19 అసెంబ్లీ, పశ్చిమ నుంచి కొత్త తూర్పుగోదావరి జిల్లాలో కలిసిన మూడు స్థానాలు వెరసి మొత్తం 22 స్థానాలకు ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పి.గన్నవరం స్థానాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలను తప్పించి వారి స్థానాల్లో కొత్త అభ్యర్థులను బరిలో నిలబెట్టింది. ముగ్గురు మంత్రుల్లో ఒకరిని రామచంద్రపురం నుంచి తప్పించి రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీలోకి దింపింది. మిగిలిన ఇద్దరు మంత్రులు విశ్వరూప్, దాడిశెట్టి రాజా యథాతథంగా వారి స్థానాల్లోనే బరిలో ఉన్నారు. మంత్రి విశ్వరూప్‌ను మార్చాలని ప్రయత్నించినా ప్రత్యామ్నాయం లేక తిరిగి ఆయన్నే కొనసాగించింది. రాజోలు స్థానంపై మరోసారి పునరాలోచించాలని ఎమ్మెల్యే రాపాక తిరగబడ్డా వైసీపీ పట్టించుకోలేదు. కాకినాడ జిల్లాలో వైసీపీ ఒక్క బీసీకి కూడా అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వకుండా మొత్తం ఓసీలతో నింపేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం పార్లమెంట్‌లో చెరో రెండు సీట్లు బీసీ, ఎస్సీలకు, మూడు సీట్లు ఓసీలకు కట్టబెట్టింది. అమలాపురం పార్లమెంట్ పరిధిలో మూడు సీట్లు ఎస్సీ, చెరో రెండు బీసీలు, ఓసీలకు కట్టబెట్టింది. వెరసి రంపచోడవరంతోపాటు మూడు పార్లమెంట్ స్థానాల పరిధిలో మొత్తం 21 సీట్లకు 12 స్థానాల్లో ఓసీలకు పెద్దపీట వేయగా 10 మంది అభ్యర్థులు కాపు సామాజికవర్గం నుంచి ఉన్నారు. మూడు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ అమలాపురం సిట్టింగ్ ఎంపీ అనురాధకు మొండిచేయి చూపింది.

వెంటాడుతున్న ఓటమి భయం..

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక, నియంతృత్వ విధానాలతో పాలన సాగించింది. ఒక పక్క పన్నుల వాత.. మరోపక్క నవరత్నాల పేరుతో లబ్ధిదారుల్లో కోత జనాలను అడుగడుగునా మోసం చేసింది. దీనికితోడు ఎక్కడికక్కడ అధికారపార్టీ నేతల విచ్చలవిడి అవినీతి, బెదిరింపులు, దందాలు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది. ఉద్యోగుల విషయంలోనూ వారిని నానా వేధింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో వైసీపై పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో విసుగొచ్చేసింది. ఎన్నికలు దగ్గరపడ్డ తరుణంలో పార్టీ ఎమ్మెల్యేలు భారీగా ఓడిపోతారనే భయం అధికార పార్టీని వెన్నాడింది. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఐప్యాక్ సర్వేల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు తేలింది. దీంతో గడచిన నాలుగు నెలలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలను సర్వే పేరుతో పక్కన పెట్టడం మొదలుపెట్టింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే ఓడిపోతారంటూ వారిని తప్పించింది. అందులో భాగంగా కాకినాడ పార్లమెంట్ పరిధిలో ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, అమలాపురం పార్లమెంట్ పరిధిలో పి.గన్నవరం స్థానాల్లో ఎమ్మెల్యేల టిక్కెట్లు చింపేసింది. వారి స్థానాల్లో కొత్త ఇన్‌చార్జులను నియమించింది. అయితే వీరిపైనా వ్యతిరేకత పెద్దగా తగ్గలేదని తేలడంతో తలపట్టుకుంది. అమలాపురంలో మంత్రి విశ్వరూప్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తంకావడంతో ఆయన్ను తప్పించాలనుకుంది. విశ్వరూప్, ఆయన తనయుడిని తాడేపల్లికి పిలిపించుకుని పార్టీ పెద్దలు మాట్లాడారు. తనకు సీటు ఖాయమైపోయిందని విశ్వరూప్ తనయుడు ప్రచారం చేసుకోవడంతో నియోజకవర్గంలో విబేధాలు మొదలయ్యాయి. తీరా ఇవి ఎక్కడి వరకు పోతాయో తెలియక చేసేదిలేక మళ్లీ విశ్వరూప్‌నే కొనసాగించింది. రామచంద్రపురం సీటు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వేణుకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని సర్వేలో తేలింది. అదే సమయంలో టిక్కెట్ తమకు ఇవ్వాలంటూ ఎంపీ బోస్ పట్టుబట్టారు. లేదంటే పార్టీని వీడిపోతానని సంకేతాలు పంపారు. మంత్రి వేణు అవినీతిపై జగన్‌కు బోస్ ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వేణును రాజమహేంద్రవరం రూరల్ సీటుకు పంపేశారు. రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌కు ఓటమి తప్పదని సర్వేలో తేలింది. దీంతో ఆయన్ను రాజమహేంద్రవరం సిటీ స్థానానికి జగన్ బదిలీ చేశారు. అటు కొవ్వూరు ఎమ్మెల్యే వనితను గోపాలపురం, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావును కొవ్వూరుకు సీట్లు మార్చి వ్యతిరేకత తప్పించుకునేందుకు వైసీపీ ప్రయత్నించింది. ఇటు కొత్తపేట, కాకినాడ సిటీ, పెద్దాపురం, జగ్గంపేట, ముమ్మి డివరం స్థానాల్లో అభ్యర్థుల్లో మార్చాలని భావించింది. కానీ అక్కడ పోటీకి దీటైన అభ్యర్థులు లేకపోవడం, మరికొందరు ఎమ్మెల్యేలైతే తమకు టిక్కెట్ నిరాకరించినా, వేరే స్థానానికి మార్చినా పార్టీని వీడిపోతామనే హెచ్చరికలు పంపారు. ఈ నేపథ్యంలో చేసేది లేక వారిని అయిష్టంగా కొనసాగిస్తూ శనివారం జాబితా వెల్లడించింది. ఇదిలా ఉంటే రాజోలు ఎమ్మెల్యే రాపాక తనకు ఈసారి వైసీపీ నుంచి సీటు ఖాయం అని ఇంత కాలం ధీమాగా ఉన్నారు. తీరా టీడీపీ నుంచి టికెట్ ఆశించిన మాజీ మంత్రి గొల్లపల్లి అనూహ్యంగా అక్కడ టిక్కెట్ దొరక్క వైసీపీలో చేరిపోయారు. ఫలితంగా ఈయనకు వైసీపీ రాజోలు టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో రాపాక భగ్గుమన్నారు. తనను రాజోలు నుంచి తప్పించి అమలా పురం ఎంపీ అభ్యర్థిగా పంపడంపై గుర్రుగా ఉన్నారు. పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో తనను ఎంపీ అభ్యర్థిగా పంపి వైసీపీ దగా చేసిందని.. ఆఖరి నిమిషంలోనైనా తనను రాజోలు పంపాలని కోరినా పార్టీ పట్టించుకోకపోవడంతో కారాలు మిరియాలు నూరుతున్నారు. రంపచోడవరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ధనలక్ష్మిని తిరిగి కొనసాగించారు. మరోపక్క కాకినాడ ఎంపీగా చలమశెట్టి సునీల్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా గూడూరు శ్రీనివాస్‌ను ప్రకటించారు. అయితే మొత్తం అసెంబ్లీ, ఎంపీ స్థానాలకు వైసీపీ అభ్యర్థులందరినీ ఖరారు చేసినా అనేక మంది నేతల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేల పరిస్థితి ఇంత దారుణంగా ఉండగా, సీటు బదిలీపై వచ్చినవారు సొంతపార్టీ కుంపట్లతో తలపట్టుకుంటున్నారు.

వైసీపీ వర్సెస్ టీడీపీ

ఒకపక్క వైసీపీ వెల్లడించిన ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థుల్లో మెజార్టీ స్థానాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నా వారిని మార్చలేక అధిష్ఠానం చతికిలబడింది. దీంతో ఇందులో ఎక్కువ స్థానాల్లో ఓటమి తప్పదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క టీడీపీ కూటమి మాత్రం గెలుపుగుర్రాలే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికను దాదాపు పూర్తిచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 సీట్లలో ఒక్క కాకినాడ సిటీ, అమలాపురం స్థానాల్లో మాత్రమే అభ్యర్థుల ప్రకటన పెండింగ్‌లో ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన స్థానాల్లో సమర్థవంతమైన అభ్యర్థులతోపాటు సామాజిక సమీకరణాలు పక్కాగా పాటించింది. బీసీలు, ఎస్సీలు, ఓసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ అన్ని వర్గాలను ఆకట్టుకుంది. ఒకపక్క వైసీపీ, మరోపక్క టీడీపీ కూటమి సీట్లపై తొంభై శాతం స్పష్టత వచ్చేసిన నేపథ్యంలో రేపటి నుంచి జిల్లాలో ఇరుపార్టీల అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లు తలపడనున్నారు. ఇక అధికార ప్రతిపక్షాల మధ్య అసలు సిసలు రాజకీయ పోరు ఆరంభం కానుంది.కాగా టీడీపీ కూటమి త్వరలో మూడు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించనున్నాయి.

బీసీలకు అన్యాయమే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 22 స్థానాల్లో అధికార వైసీపీ మెజార్టీ సీట్లు ఓసీలకే కట్టబెట్టింది. మాట్లాడితే నా ఎస్సీలు, నా బీసీలు అంటూ మాటలు వల్లె వేసే వైసీపీ అధ్యక్షుడు జగన్ సీట్ల కేటాయింపులో మాత్రం సామాజిక సమతూకం పెద్దగా పాటించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవు తున్నాయి. ఈ ఎన్నికల్లో అయినా బీసీలకు ప్రాతినిధ్యం పెంచాలని డిమాండ్లు వచ్చినా వైసీపీ పెద్దగా పట్టించుకోలేదు. మొత్తం 22 సీట్లకు 12 స్థానాల్లో ఓసీలకు పెద్దపీట వేశారు. సగానికిపైనే సీట్లు కట్టబెట్టారు. ఓసీలకు ఇచ్చిన 12 సీట్లలో పది మంది అభ్యర్థులు కాపు సామాజికవర్గం నుంచే ఉన్నారు. ముఖ్యంగా కాకినాడ పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ సీట్లు ఉండగా అన్నీ ఓసీలకే కట్టబెట్టారు. ఇందులో ఆరు సీట్లు కాపు సామాజికవర్గం నుంచి ఒక సీటు రెడ్డి సామాజికవర్గం నుంచి ఉన్నాయి. వాస్తవానికి కాకినాడ పార్లమెంట్ పరిధిలో ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సీట్లు టీడీపీ బీసీలకు ఇస్తోంది. 2019 ఎన్నికల్లో తుని, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను టీడీపీ నిలబెట్టింది.కానీ వైసీపీ ఒక్కరికీ చోటు కల్పించలేదు. ఈ సారి అదే విధానం పాటించి బీసీలకు అన్యాయం చేసింది. రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానంలో చెరో రెండు సీట్లు బీసీ, ఎస్సీలకు, మూడు సీట్లు ఓసీలకు కట్టబెట్టింది. అమలాపురం పార్లమెంట్ పరిధిలో మూడు సీట్లు ఎస్సీ, చెరో రెండు బీసీలు, ఓసీలకు కట్టబెట్టింది. తద్వారా మొత్తం 22 సీట్లలో 12 మంది ఓసీలు, అయిదు స్థానాలు ఎస్సీ, నాలుగు స్థానాల్లో మాత్రమే బీసీలకు ప్రాతినిధ్యం కల్పించింది.

శేషారావును కలిసిన దుర్గేష్



నిడదవోలు, మార్చి 16 : నిడదవోలు వివాదం సద్దుమణిగింది.. ఎన్నికల పొత్తులో భాగంగా జనసేన పార్టీ అభ్యర్థి కందుల దుర్గేష్‌కు తెలుగుదేశం, జనసేన, బీజేపీల నిడదవోలు ఉమ్మడి అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించింది.దీంతో ఇప్పటి వరకు టీడీపీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అలకబూనారు. టీడీపీ కార్యకర్తలు శేషారావుకే టిక్కెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. నిరసన ప్రదర్శనలు చేశారు. ఇదిలా ఉండగా కందుల దుర్గేష్ శనివారం ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కాసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు. సోమవారం టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటానని శేషారావు తెలిపారు.

నేడు 25 కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్ష

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. అభ్యర్థులు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ ఫోన్ నెం.89779 35609లో సంప్రదించాలన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆ నెంబరు పని చేస్తుందన్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి జిల్లాలోని 25 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. సీసీటీవీల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. ఉదయం జరిగే పరీక్షలకు ఉదయం 9.45 గంటల వరకూ, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.45 గంటల వరకూ మాత్రమే అభ్యర్థులకు పరీక్షా హాలులోకి అనుమతి ఉంటుందన్నారు. ఆ తర్వాత అనుమతి ఉండదన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు.హాల్‌టికెట్‌లో ఫొటో లేకపోయినా, సరిగా ప్రింట్ కాకపోయినా గెజిటెడ్ అధికారి సంతకంతో పాటు మూడు పాస్‌పోర్టుసైజు ఫొటోలతో పరీక్షకు హాజరు కావచ్చని తెలిపారు.

రేపటి నుంచి పది పరీక్షలు

జిల్లా నుంచి 29,990 మంది విద్యార్థుల హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని పరీక్షలకు హాజరయ్యే 29,990 మంది విద్యార్థుల కోసం 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఉదయం 10 గంటల తర్వాత అనుమతి ఉండదని పేర్కొన్నారు. విద్యార్థులు సమయాలకు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా ప్రణాళిక చేసుకోవాలన్నారు. ఎస్పీ జగదీశ్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తారన్నారు. పిల్లలు ఎక్కడా ఇబ్బంది పడకుండా కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు చేశామని, ఒత్తిడికి గురవ్వకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా పాఠశాల విద్య అధికారి వాసుదేవరావు కోరారు. తాగునీరు, అత్యవసర మెడిసిన్ వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తారసపడి సహాయం కోరితే సమాజిక బాధ్యతగా భావించి వారిని పరీక్షా కేంద్రాల వద్దకు చేర్చడంలో ఆటోవాలాలతోపాటు వాహనదారులు సహరించాలని ఆయన అభ్యర్థించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షలు జరిగే తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు రాజమహేంద్రవరం డిపోమేనేజర్ ఎస్‌కే షబ్నం తెలిపారు. పరీక్ష తేదీల్లో నివాస గ్రామం నుంచి పరీక్షా కేంద్రానికి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చని, విద్యార్థులు బస్సు కండక్టర్లకు తమ హాల్ టిక్కెట్లు చూపించాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ మాత్రమే ఇది వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

లక్ష్మీనరసింహుని దివ్య కల్యాణానికి చురుగ్గా ఏర్పాట్లు

కోరుకొండ, మార్చి16: కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు ఈనెల 19వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరగనున్న నేపథ్యంలో అన్నవరం దేవస్థానం జాయింట్ కమిషనర్ కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామి వారి దేవస్థానం ముందు ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు, పందిళ్ల నిర్మాణం, ఆలయానికి రంగులు వేయడం, కొండపైన, కొండదిగువున అన్ని నరసింహస్వామి ఆలయాలతో పాటు అన్ని ఉప ఆలయాలకు, దేవతామూర్తులకు, గోపురాలకు రంగులు వేస్తున్నారు. 650 మెట్లకు సున్నాలు వేస్తున్నారు. కొండపైన, మెట్ల మార్గం, కొండ చుట్టూ దేవస్థానం పరిసరాల్లో విద్యుత్ దీపాలంకరణలు చేస్తున్నారు. స్వామి వారి ఉత్సవమూర్తులను అలంకరిస్తున్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాలు సందర్భంగా ప్రతిరోజు రాత్రి స్వామివారు రోజుకో వాహనంలో గ్రామోత్సవం చేస్తారు. ఇందుకుగాను గజ, అశ్వ, ఆంజనేయ, శేష, గరుడ వాహనాలను సిద్ధం చేస్తున్నారు. కోరుకొండ తీర్థం పేరుతో జరిగే శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాల్లో అత్యంత ప్రాముఖ్యం కలది స్వామి వారి రథోత్సవం. ఈ సందర్భంలో స్వామి వారి అతి పురాతన పెద్ద రథాన్ని రథశాల నుంచి బయటకు తీసి మరమ్మత్తులు చేస్తున్నారు. రథానికి అమర్చే గుర్రాల బొమ్మలను సిద్ధం చేస్తున్నారు. రాత్రి పగలు సిబ్బంది స్వామి వారి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అదే విధంగా ఆలయ అనువంశిక ధర్మకర్త, దేవస్థానం ఛైర్మన్ పరాసరరంగరాజ భట్టర్ ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. పరిసర గ్రామాల్లో వాల్ పోస్టర్లు అతికించే కార్యక్రమం జరుగుతోంది. రథోత్సవం సందర్భంగా కోరుకొండకు సుమారు లక్ష మంది భక్తులు వస్తారన్న అంచనాలతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రథం తిరిగే మార్గంలో రోడ్లు, డ్రైన్లు విశాలంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం కొండపైన, కొండ దిగువున స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. దేవుని కోనేటి వద్ద స్నానాలు చేసే భక్తులు కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తున్నారు. మహిళలకు ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తున్నారు. కొండపైన దీపాలు వెలిగించే భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదే విధంగా స్థానిక రంగరాజస్వామి ఆలయం వద్ద కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఎండోమెంట్, ఎలక్ట్రికల్, ఆర్‌డబ్ల్యూఎస్, అధికారుల సమన్వయంతో పనిచేయాలని భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు.



సిద్ధమవుతున్న రథం



అలంకరణ ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన

దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

అన్నవరం, మార్చి 16: హిందూ దేవాలయాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. జాతీయ రహదారిపై విజయవాడ వైపు వెళ్లే భక్తుల కోసం నమూనాలయం వద్ద నూతన ప్రసాదం కౌంటర్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఇక్కడ భక్తులు సేదతీరేందుకు ప్రత్యేక వాతావరణం కల్పిస్తున్నామని దీనికి సుమారు రూ.4 కోట్లు వ్యయమవుతుందని అన్నారు. అనంతరం సత్యదేవుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసాదం ప్యాకెట్లను కొనుగోలు చేయగా వాటిని ఈవో అందజేశారు. అనంతరం ఆయన సత్యదేవుని దర్శనం చేసుకున్నారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఇటీవల ప్రసాద్ స్కీం నిధులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించిన అన్నదాన భవన నిర్మాణ స్థలం వద్ద కొబ్బరికాయ కొట్టారు. కార్యక్రమంలో చైర్మన్ ఐ.వి రోహిత్, పీఆర్వో కృష్ణారావు, ఇంజనీరింగ్ అధికారులు నరసింహారెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి స్వామివారి ప్రసాదం అందిస్తున్న ఈవో

శృంగారవల్లభ స్వామి ఆలయానికి భక్తుల తాకిడి



పూజలందుకుంటున్న స్వామి, అమ్మవార్లు

పెద్దాపురం, మార్చి 16: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగారవల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజామునే బారులు తీరారు. టికెట్ల విక్రయం ద్వారా రూ. 2,70,530 అన్నదాన విరాళాలు ద్వారా రూ.38,309 ఆదాయం, కేశఖండన ద్వారా రూ. 6,920, తులాభారం ద్వారా రూ.350 వెరసి రూ.3,16,109 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు 8 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. దేవస్థానం ఛైర్మన్ కర్రి జగదీష్, దేవస్థానం అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట



తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి 16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని భారీ క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. తలనీలాలు, తులాభారాలు, కానుకలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను భక్తులను అలరించాయి. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.39.75 లక్షలు లభించినట్లు ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.



సర్వర్ల మొరాయింపు.. భక్తుల ఇక్కట్లు

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సర్వర్లు మొరాయించడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆలయంలో అన్ని సేవలు ఆన్‌లైన్ చేయడంతో సర్వర్లు ఒక్కసారిగా పనిచేయకపోవడంతో భక్తులు ఇక్కట్లకు గురయ్యారు. ఆన్‌లైన్ దర్శన టిక్కెట్లు, లడ్డూ ప్రసాద టిక్కెట్లు కోసం క్యూలైన్ల ద్వారా గంటల తరబడి వేచి ఉన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఇదే పరిస్థితి కొనసాగడంతో ఆఫ్‌లైన్లలో ఏర్పాట్లు నిర్వహించారు. స్వామివారి దర్శనం, లడ్డూ ప్రసాదాల కోసం భక్తులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆలయ స్వర్ణ శిఖర ప్రతిష్ఠ పూజలు



ప్రత్యేక అభిషేకాలు నిర్వహించిన ఆలయ పండితులు

తరలివచ్చిన భక్తులు

ఆత్రేయపురం, మార్చి16: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం స్వర్ణశిఖర ప్రతిష్ఠా పూజలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ప్రోత్సాహంతో దాతలు ముందుకు వచ్చి రూ.35 లక్షలతో స్వర్ణశిఖరాలను సమర్పించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు వసంత మండపంలో దాతలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవకళశారాధన, కుంభ ఆవాహన, శిఖరగర్త సంప్రోక్షణ, శిఖర అభిషేకం, సాయంత్రం అష్టోత్తర కలశారాధన, పంచసయ్యాదివాసం, చతుర్వేద స్వస్తి తదితర కార్యక్రమాలను వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ ఘనంగా నిర్వహించారు. శ్రీవేంకటేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి, అన్నపూర్ణసమేత విశ్వేశ్వరస్వామి, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాలలో శిఖర ప్రతిష్ఠా మహోత్సవం ఉదయం ఘనంగా నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో భూపతిరాజు కిశోర్‌కుమార్, దాతల కుటుంబ సభ్యులు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 16: రామచంద్రపురంలో జిల్లా అదనపు, సెషన్స్ కోర్టు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. రామచంద్రపురం, కె.గంగవరం, రాయవరం, బిక్కవోలు, అనపర్తి, మండపేట, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాల పరిధికి సంబంధించి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు ఏర్పాటుకు న్యాయశాఖ ప్రభుత్వ కార్యదర్శి జి.సత్యప్రభాకరరావు జీవో ఎం.ఎస్ నెం.53ను శుక్రవారం జారీ చేశారు. జిల్లా కోర్టు ఏర్పాటుకు జిల్లా జడ్జి, ముఖ్య పరిపాలనాధికారి, పర్యవేక్షకుడు, ట్రాన్స్‌లేటర్, సీనియర్ సహాయకుడు, స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 1, జూనియర్ సహాయకులు 5, టైపిస్టులు 3, అమీనాలు 3 ఇలా మొత్తం 31 పోస్టులు మంజూరు చేస్తూ జీవో జారీ చేశారు. రామచంద్రపురంలో అదనపు జిల్లా కోర్టు ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి వేణుగోపాలకృష్ణ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ జిల్లా కలెక్టరు హిమాన్షు శుక్లాకు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పిల్లి మురళీ, కార్యదర్శి వాడ్రేవు సాయి ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.ఎస్.ఎస్ శర్మ, పలివెల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి వీర్రెడ్డి, కోశాధికారి జె.ఎస్.ఎస్.చక్రవర్తి, మహిళా ప్రతినిధి కె.సత్యవాణి, జూనియర్ ప్రతినిధి పిల్లా పృథ్వీరామయ్య కృతజ్ఞతలు తెలిపారు.

హైవేపై రెండు కార్ల ఢీ



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

గొల్లప్రోలు, మార్చి 16: కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్ రోడ్డులో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు వ్యక్తులకు గాయాలయ్యాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి నుంచి వస్తున్న కారు 216 జాతీయ రహదారిపై భోగాపురం జంక్షన్ వద్ద ప్రత్తిపాడు వెళ్లేందుకు మలుపు తిరుగుతుండగా, వాడపల్లి దర్శనం ముగించుకుని విశాఖపట్నం వెళుతున్న కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో ప్రత్తిపాడు వైపు వెళుతున్న కారు వ్యాన్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో ఎనిమిదేళ్ల బాలుడితో సహా ఆరుగురికి గాయాలయ్యాయి. బాలుడితో పాటు మరో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. వారిని హైవే పోలీసులు అంబులెన్స్‌లో పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

నేడు ఆర్థోప్లాస్టీ సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: స్థానిక ఆర్యాపురం సాయి హాస్పిటల్‌లో రాజమండ్రి ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరి ఆర్థ్రోప్లాస్టీ సదస్సును నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహక కార్యదర్శి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.విజయకుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో నిపుణులైన వైద్యులు ఈ సదస్సుకు హాజరై కీళ్ల మార్పిడి సర్జరీల్లో మెలకువలు, కొత్త పోకడలు, నైపుణ్యాల పెంపునకు అవసరమైన పరిజ్ఞానాన్ని వివరిస్తారన్నారు. అలాగే వారు గోదావరి జిల్లాల వైద్యులతో ముఖాముఖి చర్చించి ఆధునిక విధానాలను తెలియజేస్తారని చెప్పారు. సదస్సుకు కోయంబత్తూరులోని గంగా ఆసుపత్రి డాక్టర్ పి.ధనశేఖర్ రాజా, ఆస్టర్ ఆసుపత్రి డాక్టర్ జేవీ శ్రీనివాస్ హాజరవుతారని విజయకుమార్ తెలిపారు.

పంట కాల్వలో మొసలి?





అమలాపురం రూరల్, మార్చి 16: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఈదరపల్లి ప్రధాన బెండా కెనాల్‌లో శనివారం మధ్యాహ్నం మొసలి ప్రత్యక్షమైందన్న సమాచారం అందరిలోను భయాందోళనకు గురి చేసింది. ఈదరపల్లి పంచాయతీ కార్యాలయం ఎదుట ప్రధాన పంటకాల్వలో మొసలి గట్టుపైకి ఎక్కుతుండగా అవతలి ఒడ్డున ఉంటున్నవారు సెల్‌ఫోన్లో ఫొటోలను తీశారు. గట్టుపైకి ఎక్కిన మొసలిని గుర్తించేందుకు స్థానికులు శతవిధాలా ప్రయత్నించారు. అయితే అవతలి నుంచి ఫొటోలు తీసి ఇవతలి గట్టుకు వచ్చేసరికి మొసలి తిరిగి పంటకాల్వలోకి వెళ్లిపోయి ఉండవచ్చునని భావిస్తున్నారు. మొసలిని ప్రత్యక్షంగా చూసామని స్థానిక మహిళలు చెబుతున్నారు. అయితే అది మొసలి కాదని ఉడుము అయి ఉండవచ్చునని కొందరు చెబుతున్నప్పటికీ ఉడుము అంత పెద్ద ఆకారంలో ఉండే అవకాశం లేదని మరికొందరు అంటున్నారు. ఏది ఏమైనా జాగ్రత్తగా ఉండాలని పంచాయతీ అధికారులు చెబుతున్నారు.

కుసుమ ధర్మన్న రచనలు స్ఫూర్తిదాయకం

నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి16 : కుసుమ ధర్మన్న రచనలు స్ఫూర్తిదాయకమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంత్యుత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నన్నయ తెలుగు శాఖ నిర్వహణలో తెలుగు జాతీయ సదస్సు కవి సమ్మేళనం, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలు ప్రదాన కార్యక్రమాలు జరిగాయి. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ 1921 సంవత్సరంలో గరిమెళ్ల సత్యనారాయణ రాసిన మాకొద్దీ తెల్లదొరతనం గేయానికి భిన్నంగా నల్లదొరలు పాలన వచ్చినంత మాత్రాన హరిజనులకు ఒరిగేదేమీ ఉండదని నిర్మోహమాటంగా మాకొద్దీతెల్లదొరతనం ప్రతిగేయం రాసిన తొలిదళిత విప్లవకవి కుసుమ ధర్మన్న అని కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ కుసుమ ధర్మన్న సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన విధానాలు తెలిపారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్ సామాజిక ఆత్మగౌరవం, చైతన్యం కుసుమ ధర్మన్న అనే అంశంపై ప్రసంగించారు. కుసుమధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధా కుసుమ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన కుసుమ ధర్మన్న విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని కోరారు. కుసుమ ధర్మన్న కళా పీఠంచే సాహితీ సేవా పురస్కారాన్ని నన్నయ తెలుగుశాఖ అధ్యాపకుడు తరపట్ల సత్యనారాయణకు వీసీ ప్రదానం చేశారు. 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్రసమర్పణలతో ముద్రించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. కుసుమ ధర్మన్న సాహితీ ప్రస్థానం సామాజిక సేవ అనే అంశంపై జాతీయ స్థాయిలో 53 మంది కవులు కవితాగానం చేశారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, ఆంధ్ర విశ్వ విద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ బూసి వెంకటస్వామి, వీఎస్ఎం కళాశాల తెలుగు శాఖాధిపతి ర్యాలి శ్రీనివాసు, కందుకూరి వీరేశలింగం కళాశాల శాఖాధిపతి పి.వి.బి.సంజీవరావు, నన్నయ తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ కె.వి.ఎన్.డి.వరప్రసాద్, అధ్యాపకులు తలారి వాసు, డి.లక్ష్మీనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



కుసుమ ధర్మన్న సాహిత్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

పనులు పూర్తి కాకుండానే ప్రారంభోత్సవాలు!

ఎన్నికల కోడ్ రాక ముందే అధికార పార్టీ నేతల హడావిడి



ప్రారంభిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ



అసంపూర్తిగా మిగిలిన ఆలయం పనులు

తుని రూరల్, మార్చి 16: ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ విడుదల అవుతున్న తరుణంలో అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు హడావిడిగా శంకుస్థాపనలు చేయడం మొదలుపెట్టారు. అలాగే పనులు పూర్తి కాకపోయినా ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. లోవ దేవస్థానం ప్రధాన గోపురం పనులు కొనసాగుతున్న సంగతి తెలిసిందే. పనులు నిరాటంకంగా కొనసాగితే మరో రెండు నెలలకు కానీ పూర్తవ్వవు. ఈ లోపు ఎన్నికలు వచ్చేయడంతో హడావిడిగా ప్రారంభోత్సవానికి ఆదేశాలు ఇవ్వడంతో అధికారులు నిబంధనలు పక్కన పెట్టి చకచకా ఏర్పాట్లు చేశారు. కోడ్ అమలుకు నాలుగు గంటల ముందే దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయానికి చేరుకుని స్థానిక వైసీపీ నాయకులు, ట్రస్టుబోర్డు సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఆలయ నిర్మాణంలో ఉన్న శ్లాబ్‌కు ఏర్పాటు చేసిన సెంట్రింగ్ కర్రలను అత్యవసరంగా తొలగించి ఆలయానికి పక్కాగా ఏర్పాటు చేయాల్సిన తలుపులకు బదులు డమ్మీ తలుపులు ఏర్పాటు చేసి హడాహుడిగా ఆలయాన్ని ప్రారంభించడం పట్ల భక్తులు దుమ్మెత్తి పోస్తున్నారు. పనులు పూర్తయ్యాక శాస్త్రోక్తంగా జరగాల్సిన కార్యక్రమం హడావిడిగా చేయడం ఏమిటని పలువురు పండితులు, భక్తులు ప్రశ్నిస్తున్నారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో శనివారం భారీగా కేసులను పరిష్కరించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత కార్యక్రమాన్ని ప్రారంభించి పర్యవేక్షించారు. సాయంత్రం 6 గంటల సమయానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వివిధ కోర్టుల్లో ఏర్పాటు చేసిన బెంచ్‌లలో క్రిమినల్ 1013, సివిల్ 379 కలిపి మొత్తం 1513 కేసులకు పరిష్కారం చూపించారు. సుమారు రూ.2,30,00,000 పరిహారాన్ని ఆయా సంస్థల ద్వారా బాధితులకు అందజేసేలా అవార్డులు ప్రకటించారు. జిల్లా ప్రధాన న్యాయస్థానంలో విచారణలో ఉన్న ఒక రోడ్డు ప్రమాదం కేసు (ఎంవీఓపీ 316/2021)కు సంబంధించి బాధితురాలికి ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా రూ.1,12,00,000 పరిహారాన్ని అందజేసే విధంగా పరిష్కారం చూపారు. బాధితురాలి సమస్యకు సత్వర న్యాయం అందజేయడంలో చొరవ చూపిన డీఎల్ఎస్ఏకి, ఆమె న్యాయవాదులు ఎస్‌జీ శంకర్, కె.నరసింహారావు, బీమా సంస్థ న్యాయవాది దునే శ్రీనివాసరావు, చోళ మండలం బీమా సంస్థకు పీడీజే సునీత అభినందనలు తెలిపారు.

బదిలీ అయ్యారు..వెంటనే తిరిగొచ్చారు

రాజమహేంద్రవరంరూరల్; మార్చి 16: వడ్డించే వాడు మనవాడైతే బంతిలో చివర కూర్చున్న అందుతుంది అంటారు.. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఓ బదిలీ అంశాన్ని పరిశీలిస్తే ఇదే అర్థమవుతుంది. డా. బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం రెగ్యులర్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తూ రాజమహేంద్రవరం రూరల్ మండలం ఎంపీడీవోగా శ్రీనివాసరావు ఇన్‌చార్జి విధులు నిర్వహిస్తున్నారు. భారతీయ ఎన్నికల సంఘం (ఈసీఐ) గైడ్‌లైన్స్ ప్రకారం పంచాయతీ రాజ్ కమిషనర్(పీఆర్‌అండ్‌ఆర్‌డీ) తాడేపల్లి, కోనసీమ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ప్రకారం ఎంపీడీవో శ్రీనివాసరావును డిప్యూటేషన్ రద్దు చేస్తూ అంబాజీపేట ఎంపీడీవోగా చార్జి తీసుకోవాలంటూ ఈనెల 15న ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ మండలంలో ఈవోపీఆర్‌డీగా పనిచేస్తున్న డి. బాబూరావును ఎంపీడీవోగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే 24 గంటలు గడవక ముందే అంబాజీపేట నుంచి తిరిగి రాజమహేంద్రవరం రూరల్ మండలానికి శ్రీనివాసరావుకు పోస్టింగ్ ఇస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ కన్నబాబు ఆదేశాల మేరకు జిల్లా పరిషత్ సీఈవో ఈనెల 16న ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల ప్రభుత్వ సంక్షేమ పథకాలు పంపిణీ కార్యక్రమంలో ఎంపీడీవో కీలకపాత్ర పోషించి అధికార పార్టీకి చెందిన ఓ నేత అండదండలు, ఆయన మెప్పును పొందారని, దీంతో ఎలక్షన్ కమిషన్ నిబంధనలు కూడా పక్కన పెట్టి శ్రీనివాసరావు తిరిగి రాజమహేంద్రవరం రూరల్ మండలానికి రావడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ధాన్యం సొమ్ము కోసం రైతుల ధర్నా



ఆందోళన చేస్తున్న రైతులు

రాజవొమ్మంగి మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వం రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి నేటి వరకు సొమ్ములు చెల్లించకపోవడంతో రాజవొమ్మంగి రైతు భరోసా కేంద్రం వద్ద శనివారం రైతులు ధర్నా నిర్వహించారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, దూసరపాము ఎంపీటీసీ నల్లా సత్తిబాబు, కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాథం ఆధ్వర్యంలో సుమారు 50 మంది రైతులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో రైతులు, నాయకులు మాట్లాడుతూ నామమాత్రంగా కొందరికి మాత్రమే సొమ్ములు చెల్లించారని ఇంకా రూ.కోట్లలో బకాయి ఉందని అన్నారు. వ్యవసాయశాఖ అధికారి రమేష్ నాయుడుకు వినతిపత్రం అందించారు. అయితే వ్యవసాయ శాఖ అధికారికి వినతిపత్రం ఇచ్చినా, ధర్నా నిర్వహించినా తమ సమస్య పరిష్కారం అయ్యేలా లేదని రైతులు అనుకుని సోమవారం రంపచోడవరం వెళ్లి అక్కడ అధికారులకు తెలియజేయాలని నిర్ణయించుకున్నారు.

ఏజెన్సీ సమాచారం

కోయ వర్సెస్ కోయ

● రంపచోడవరం అసెంబ్లీ బరిలో ఒకే సామాజిక వర్గం మధ్య పోటీ

రంపచోడవరం, మార్చి16: రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గ బరిలో ప్రధాన పోటీ ఒకే సామాజికవర్గం మధ్య జరగనుంది. తెలుగుదేశం నుంచి మిరియాల శిరీషాదేవి, వైసీపీ నుంచి నాగులాపల్లి ధనలక్ష్మి ఇద్దరూ కోయ సామాజిక వర్గానికి చెందినవారే కావడం విశేషం. ప్రధాన పార్టీల మధ్య పోరు ఎలా ఉంటుందన్న దాని కంటే ఒకే సామాజికవర్గం మధ్య పోరు ఎలా ఉంటుందన్నది సర్వత్రా చర్చనీయాంశమైంది. ఈ నియోజకవర్గంలో ఎక్కువ సార్లు వేర్వేరు సామాజికవర్గ అభ్యర్థుల మధ్యే పోటీ ఉండేది. ఈ సారి ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు పోటీ పడటంతో వారి సామాజకవర్గ ఓటు చెరి సమానంగా చీలుతుందని భావించినా ఈ ఇరువురినీ సమర్థించే ఇతర సామాజిక వర్గాల బలాబలాలను బట్టి ఈ అభ్యర్థుల విజయావకాశాలు నిర్దేశించబడతాయి. మిరియాల శిరీషాదేవి భర్త విజయభాస్కర్ వాల్మీకి సామాజికవర్గానికి చెందిన వారు కావడంతో వాల్మీకి ఓటు బ్యాంకుతో పాటు జనసేన, బీజేపీకి చెందిన ఓట్లు కూడా కలిసి వస్తాయని భావిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకు అంతా తమ ఖాతాలోనే పడుతుందన్న ధీమా తెలుగుదేశంలో ఉంది. ఇక వైసీపీ విషయానికి వస్తే తమకు స్థిరంగా ఉన్న ఓటు బ్యాంకుతో పాటు ఎమ్మెల్సీ అనంతబాబు మూలంగా గిరిజనేతర ఓటు బ్యాంకు కలిసి వస్తుందని అందునా కాపు సామాజికవర్గ ఓటు బ్యాంకు కూడా తమకే కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఏం జరుగుతుందో ఇక వేచి చూడాలి.

జగన్‌కు రుణపడి ఉంటా: ధనలక్ష్మి

రంపచోడవరం నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా తిరిగి తనకే అవకాశం ఇచ్చినందుకు సంతోషంగా ఉందని, పార్టీ అధినేత జగన్మోహనరెడ్డికి ఇందుకు రుణపడి ఉంటానని నాగులాపల్లి ధనలక్ష్మి అన్నారు. నియోజకవర్గంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇచ్చే ప్రోత్సాహంతో మళ్లీ తాను విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

రాక్షస పాలనను అంతమొందించాలి

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిరీషాదేవి


మాట్లాడుతున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిరీషాదేవి

రంపచోడవరం, మార్చి 16: రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందుకు సమయం ఆసన్నమైందని నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి మిరియాల శిరీషాదేవి అన్నారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జగన్‌పాలనను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అలాగే అనంతబాబు అరాచకాలకు చెక్ పెట్టేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించి తెలుగుదేశం జెండాను ఎగురవేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పాము అర్జునుడు, మరిశెట్ల వెంకటేశ్వరరావు(బుజ్జి), ప్రధాన కార్యదర్శులు అనంతమోహన్, మట్ల మెహర్‌బాబాగౌడ్, డి.భానుప్రకాష్, టీడీపీ నాయకులు అడబాల బాపిరాజు, షేక్ సుభానీ, దాకారపు సత్యనారాయణ, తాతారావు, వేశపరపు చంద్రకుమార్, సిద్ధ వెంకన్నదొర, బొడ్డేటి వీరబాబు, అయినాల పెదకాపు, గల్లా సత్తిబాబు, జనసేన నాయకులు పాపోలు శ్రీనివాస్, కాకిస్వామి, మంగరౌతు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్తి స్థాయి సదుపాయాలు కల్పించాలి


పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న చింతూరు ఆర్డీవో కావూరి చైతన్య

చింతూరు, మార్చి 16 : పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాల్సింది గా చింతూరు ఆర్డీవో కావూరి చైతన్య ఆదేశించారు. ఆర్డీవో మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు, సిబ్బందికి పలు ఆదేశాలు ఇచ్చారు. ప్రధానంగా అంగవైకల్యం ఉన్నవారికి, వృద్ధులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదన్నారు. ఆ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. చింతూరు, చూటూరు, ఏజీ కొడేరు, మల్లెతోట పాఠశాలలను ఆయన సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. సెక్టోరియల్ అధికారులు, బీఎల్‌వో, తహసీల్దార్, ఆర్ఐ, ఆర్డీవో వెంట ఉన్నారు.

వైసీపీ ఫ్లెక్సీలు, జెండాలు తొలగింపు


వైసీపీ ఫ్లెక్సీ జెండాలు తొలగిస్తున్న ఉద్యోగులు

కూనవరం,మార్చి16: ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలో ఉన్న వైసీపీకి చెందిన ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, జెండాలు తొలగించేశారు. మధ్యాహ్నం 3 గంటలకు దేశ వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మండలంలో ఉన్న ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి ఫ్లెక్సీలతోపాటు వైసీపీ జెండాలను సైతం తొలగించేశారు. కోడ్ అమలులో ఉందని ఏ పార్టీ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయవద్దని రాజకీయనాయకులకు అధికారులు తెలిపారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

వరరామచంద్రాపురం, మార్చి 16: పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల విద్యాశాఖాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలో రెండు పరీక్షా కేంద్రాలలో సోమవారం నుంచి టెన్త్ పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. వీఆర్ పురం జిల్లా పరిషత్ పాఠశాలలో 179 మంది, సున్నవారిగూడెం పరీక్షా కేంద్రంలో 200 మంది పది పరీక్షలకు హాజరు కానున్నట్లు ఎంఈవో తెలిపారు. ఈ రెండు పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పించామని చెప్పారు. వీఆర్‌పురం పరీక్షా కేంద్రంలో 8 మంది ఇన్విజిలేటర్ల ను, సున్నవారిగూడెం పరీక్షా కేంద్రంలో 10 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు.

టికెట్ మారిస్తేనే పనిచేస్తాం

● రంపచోడవరం టీడీపీ అసమ్మతి నాయకులు

రంపచోడవరం మార్చి 16: రంపచోడవరం నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులను కాదని కొత్తవారికి ఇచ్చిన టికెట్‌ను మార్చితేనే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి పనిచేస్తామని రంపచోడవరం నియోజకవర్గ అసమ్మతి నాయకులు అధిష్ఠానానికి స్పష్టం చేశారు. శనివారం రంపచోడవరంలో వంతల రాజేశ్వరి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో రంపచోడవరం నియోజకవర్గంలోని 11 మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసు ఈ సమావేశానికి హాజరై ఆయా నాయకుల అభిప్రాయాలను నమోదు చేసుకుని వెళ్లారు. శుక్రవారం పార్టీ అధినేత చంద్రబాబుకు నివేదించిన అంశాలను వంతల రాజేశ్వరి, శీతంశెట్టి వెంటేశ్వరావు సమావేశంలో వివరించారు. పలువురు నాయకులు తమ అభిప్రాయలను వెల్లడించారు. పార్టీ టికెట్‌ను మార్చి గత కొన్నేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్న ఎవరికి ఇచ్చినా తాము పనిచేస్తామని, లేని పక్షంలో భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే వెల్లడిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నాయకులు గొర్లె సునీత, కె.పోచమ్మ, పలు మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు.

రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లు వేగవంతం: జేసీ

దివాన్‌చెరువు, మార్చి 16 : సార్వత్రిక ఎన్నికల నిమిత్తం స్థానిక ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆవరణలో ఏర్పాటుచేస్తున్న రిసెప్షన్ కేంద్రం ఏర్పాట్లును వేగవంతం చేస్తున్నట్లు జిల్లాజాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్ అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేస్తున్న వివిధ నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను రాజమహేంద్రవరం ఆర్డీఓ ఏ.చైత్రవర్షిణితో కలసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ తేజ్‌భరత్ వివరాలు తెలుపుతూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాధవీలత ఆదేశాలమేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. ఓటింగ్ పూర్తయిన తదుపరి బ్యాలెట్ యూనిట్‌లు నియోజక వర్గాల నుంచి నన్నయ విశ్వవిద్యాలయానికి చేరుకుంటాయన్నారు. నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసిన రిసెప్షన్ కౌంటర్‌లో వాటిని హ్యాండెడ్‌ఓవర్ చేసుకుని స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలిస్తామని అన్నారు. ప్రస్తుతం రిసెప్షన్ కేంద్రాలకు చెందిన పనులు చురుగ్గా జరుగుతు న్నాయని చెప్పారు. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తిచేసే విధంగా దిశానిర్దేశం చేశారు. జాయింట్‌కలెక్టర్ తేజ్‌భరత్ వెంట ఆర్డీవో ఏ.చైత్రవర్షిణి, నన్నయ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తదితరులు ఉన్నారు.

కూటమి విజయం ఖాయం: గన్ని కృష్ణ

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 16: రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ అన్నారు. ఆయన ఇటీవల గుండెకు పేస్‌మేకర్ సర్జరీ చేయించుకోవడంతో శనివారం విజయవాడలో జరిగిన టీడీపీ లీగల్ సెల్ వర్క్‌షాపునకు వెళ్లలేదు. దీంతో తాను మాట్లాడదలచుకున్నది ఒక లేఖరూపంలో విజయవాడ పంపించారు. ఈ సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు గన్ని కృష్ణ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఒక కీలక ప్రకటన చేయాలని, ముళ్ల కిరీటంగా ఉన్న భూహక్కు చట్టంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు.

మహనీయుడు పొట్టి శ్రీరాములు

● కలెక్టర్ మాధవీలత
● ఘనంగా 'అమరజీవి' జయంతి


పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మాధవీలత, డీఆర్వో నరసింహులు


డీపీవోలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ జగదీశ్

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 16: భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కలెక్టర్ మాధవీలత, డీఆర్వో జి.నరసింహులు జిల్లా అధికారులతో కలసి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరాములు నిర్దేశించుకొన్న లక్ష్యాలు చేరుకోవడానికి పట్టుదలతో ఉద్యమించారని, స్వాతంత్ర్యం అనంతరం ప్రత్యేక రాష్ట్రం కావాలంటూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారని వివరించారు. జాతి అభివృద్ధిని కాంక్షిస్తూ భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఉండాలని అవిశ్రాంతంగా ఉద్యమం చేశారన్నారు. తెలుగు ప్రజల మనోభావాలు కాపాడడానికి ఆయన చేసిన ఉద్యమాలు చరిత్రలో నిలిచాయన్నారు.

భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహుడు పొట్టి శ్రీరాములు

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): భాషా ప్రయుక్త రాష్ట్రాల పితా మహుడు పొటి శ్రీరాములు అని ఎస్పీ జగదీశ్ కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు తెలుగువారి కోసం ఉద్యమించిన మహాపురుషుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు టి.సర్కార్(క్రైమ్స్), ఎల్.చెంచి రెడ్డి (ఏఆర్) తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ కార్యాలయంలో.. ప్రాంతీయ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన తెలుగువారికి చేసిన సేవలను స్మరించుకున్నారు. పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితంగా 1953 అక్టోబరు 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు అయ్యిందన్నారు. హైదరాబాద్ రాష్ట్రం విలీనంతో 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ అవతరించిందని గుర్తుచేశారు. డీఎస్పీ ముత్యాలునాయుడు, శివశంకర్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కళాశాలలోని డాక్టర్ అంబేడ్కర్ సెమినార్ హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ విద్యార్థులు త్యాగమూర్తుల జీవితచరిత్రలను చదవాల్సిన అవసరం ఉందన్నారు. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఏర్పడటానికి పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగం, ఆయనలోని దేశభక్తి ఉందని అన్నారు. ఈ సందర్భంగా తెలుగుశాఖాధిపతి పీఏ సత్యనారాయణ రచించిన సీతాకోక వనవాసం అనే కవితా సంపుటిని ఆవిష్కరించారు. తెలుగుశాఖ నుంచి శ్రీనివాస్, శివాజీ, రేవతి, రాజు, ప్రిస్కిల్లా, పొలిటికల్ సైన్స్ నుంచి సీతామహాలక్ష్మి, ఫరా, విద్యార్థులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిల అశోక పాల్గొన్నారు. శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

నెలరోజులు గడుస్తున్నా పూర్తికాని రోడ్డు పనులు

● ఎంపీ భరత్ తీరుకు టీడీపీ ధర్నా


దానవాయిపేట రోడ్డులో నిరసన ధర్నా చేస్తున్న టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: రాజమహేంద్రవరం దానవాయిపేట ప్రధాన రోడ్డు మరమ్మతులు చేపట్టి నెలరోజులు గడుస్తున్నా పూర్తికాకపోవడంతో స్థానికంగా వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ-జనసేన అభ్యర్థి ఆదిరెడ్డి వాసు శనివారం ధర్నా నిర్వహించారు. స్థానిక విమలమ్మ ఆసుపత్రి నుంచి సురుచి స్వీట్‌స్టాల్ వరకు ఉన్న రోడ్డులో నల్ల జెండాలతో నిరసన చేపట్టారు. వాసు మాట్లాడుతూ 25శాతం కమిషన్ కోసం ఎంపీ భరత్ అనాలోచిత నిర్ణయాలతో పనులు చేపట్టి జాప్యం చేశారని, దీని ఫలితంగా స్థానిక వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. నాలుగు రోజుల్లో ఈ పనులు ప్రారంభించి పూర్తిచేయాలని లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కాశి నవీన్‌కుమార్, వాసిరెడ్డి రాంబాబు, నాయకులు రెడ్డి మణేశ్వరరావు, వర్రే శ్రీనివాసరావు, బుడ్డిగ రాధా, దాస్యం ప్రసాద్, చాపల చిన్నరాజు, ఉప్పులూరి జానకీరామయ్య, నిమ్మలపూడి గోవింద్, మస్తాన్ చౌదరి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో మార్పు మొదలు: ఎమ్మెల్యే అభ్యర్థి వాసు

కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఎన్నికల కోడ్ అమలుతో రాష్ట్రంలో మార్పు మొదలైందని టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 41వ డివిజన్‌లో వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు 200మంది కార్యకర్తలు చేరారు. వారికి వాసుతోపాటు జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణలు పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రాకతో రాష్ట్రంలో దుష్టపరిపాలనకు అంతిమఘడియలు ప్రారంభమయ్యాయన్నారు. అనుశ్రీ మాట్లాడుతూ భరత్‌రామ్‌కు పతనం కోటిలింగాలపేట నుంచే ఆరంభమైందన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ మర్రి దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుడ్డిగ రాధా, బుడ్డిగ గోపాలకృష్ణ, బుడ్డిగ రవి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన కనకదుర్గ

ఇటీవల ఎంపీ భరత్‌రామ్ సమక్షంలో వైసీపీలోకి చేరిన చోడిశెట్టి కనకదుర్గ అక్కడ ఇమడలేక టీడీపీలో చేరారు. రాజమహేంద్రవరం 4వ డివిజన్‌లో శనివారం టీడీపీ తాడేపల్లిగూడెం పరిశీలకుడు నక్కా చిట్టిబాబు, నక్కా దేవి వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో, ఆదిరెడ్డి వాసు సమక్షంలో ఆర్‌పీ టీడీపీ తీర్థం పుచుకున్నారు. ఆమెకు పార్టీ కండువాతో వాసు స్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరావు, రాచపల్లి ప్రసాద్, మునగాల సత్యనారాయణ, చింతపల్లి నాగేశ్వరరావు, చిక్కాల నాగేశ్వరావు పాల్గొన్నారు.

వైసీపీకి దార శేషు రాజీనామా



వైసీపీలో పదేళ్లుగా సేవలందించిన రాజమహేంద్రవరం 47వ డివిజన్‌కు చెందిన న్యాయవాది దారా శేషుకుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. గతంలో టీడీపీలో పనిచేసిన శేషు వైసీపీలో చేరారు. ఆ పార్టీలో తగిన ప్రాధాన్యం లేకపోవడంతో పార్టీని వీడారు. రాజీనామా లేఖను వైసీపీనగర అధ్యక్షుడికి పంపించారు. త్వరలో ఆదిరెడ్డి సమక్షంలో తన అనుచరులతో కలిసి టీడీపీలోకి చేరబోతున్నారు.

అనపర్తి టికెట్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలి

● టీడీపీ కార్యకర్తల సమావేశంలో నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సిరసపల్లి

అనపర్తి, మార్చి 16 : వచ్చే సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ఇప్పటికే చంద్రబాబు మొదటి జాబితాలో ప్రకటన చేశారు. ఇటీవల టీడీపీ జనసేన పార్టీలతోపాటు బీజేపీ కూడా కలవడంతో సీట్ల సర్దుబాటులో అనపర్తి సీటు బీజేపీకి కేటాయిస్తారన్న వార్తల నేపథ్యంలో శనివారం అనపర్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరావు మాట్లాడుతూ అనపర్తి నియోజకవర్గంలో గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ చేస్తున్న అరాచకాలను ఎండకడుతూ అనేక అక్రమ కేసులు బనాయించిన పట్టువదలని విక్రమార్కుడిలా యుద్ధం చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కాదని బీజేపీకి సీటు కేటాయిస్తారని జరుగుతున్న ప్రచారంపై అధిష్టానం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. అనపర్తి నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా నల్లమిల్లి గెలుపు దిశగా ఉన్నారని అన్నారు. జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సత్తి దేవదానరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీలో ఉంటారని ఆయనే విజయం సాధిస్తారని కార్యకర్తలు అధైర్యప డొద్దని అన్నారు. బీసీ నాయకుడు రేలంగి నాగేశ్వరరావు మాట్లాడుతూ అనపర్తిలో నల్లమిల్లి మూలారెడ్డి కుటుంబానికి తిరుగులేదని, రామకృష్ణారెడ్డి కాదని చంద్రబాబు బీజేపీకి సీటు ఇచ్చే ప్రసక్తిలేదని నియోజకవర్గంలో ఓటమి భయంతో వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశం అనంతరం నాయకులు కార్యకర్తలు బైక్‌లతో ర్యాలీగా రామవరంలోని రామకృష్ణారెడ్డి నివాసానికి చేరుకుని ఆయనకు సంఘీభావం ప్రకటించారు.

ఓటమి భయంతో వైసీపీ నేతల దుష్ప్రచారం

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

వచ్చే ఎన్నికలలో అనపర్తి నియోజకవర్గం నుంచి టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలిచేది తానేనని విజయం మనదేనని కార్యకర్తలు అధైర్య పడాల్సిన పనిలేదని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. సంఘీభావం తెలిపేందుకు రామవరం చేరుకున్న కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఓటమి భయంతో వైసీపీ అనపర్తి సీటుపై దుష్ప్రచారం చేస్తుందన్నారు. అనపర్తి నియోజకవర్గంలో ఎనిమిది కిలో మీటర్ల మేర చంద్రబాబును నడిపించిన వైసీపీ పెద్దలను ఆయన ఎలా మరచిపోతారని ఇక్కడ తెలుగుదేశం పోటీ చేయాల్సిన ఆవశ్యకత ఆయనకు తెలుసునని అన్నారు. టీడీపీ నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి వెంకట రామారెడ్డి, జుత్తుగ కృష్ణ, వెలుగుబంటి సత్తిబాబు, నియోజకవర్గ నలు మూలల నుండి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం లబ్ధిదారుల నిలదీత

● సెక్రటరీల ద్వారా ఇస్తామని సర్దిచెప్పి పంపేసిన అధికారులు

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 16: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి శనివారం మధ్యాహ్నం కొందరు మహిళలు వచ్చి తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. ఇటీవల స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో ఎంపీ భరత్‌రామ్ ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. ఇందులో చాలా మందికి పట్టాలు ఇవ్వలేదు. దీంతో కొందరు మహిళలు శనివారం కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి తమకు పట్టాలు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఇప్పుడు ఇవ్వడం కుదరదని వార్డు కార్యదర్శుల ద్వారా పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, అంతవరకు ఓపిక పట్టాలని కోరడంతో వారు వెనుదిరిగినట్టు తెలిసింది. చాలామంది లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం, ఇళ్ల స్థలం పట్టాల కోసం ఇంకా అధికారులపై నమ్మకంతో ఉన్నా రు. ఈ తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో పరిస్థితి మొత్తం తల్లకిందులైంది.

'కృషి, పట్టుదలతోనే ఉన్నత లక్ష్యాలు సాధించగలం'


మాట్లాడుతున్న డైలాగ్ రైటర్ శ్రీకాంత్

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని సాధించాలంటే కృషి,పట్టుదల, ఓర్పు, నేర్పు ఉండాలని ప్రముఖ స్క్రీన్‌ప్లే, డైలాగ్ రైటర్ శ్రీకాంత్ విస్సా చెప్పారు. శనివారం నగరంలోని భాష్యంబ్లూమ్స్ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. బ్లూమ్స్ హూరే పేరుతో జరిగిన కార్యక్రమానికి శ్రీకాంత్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సభకు భాష్యం ముఖ్య సలహాదారు మైఖేల్ రాజ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ జీవితంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, వాటి కోసం ప్రతిక్షణం సన్నద్ధంగా ఉండాలన్నారు. ఆ దిశగా ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా ఎంతో అవసరమన్నారు. భావిభారత పౌరులను ఉత్తమంగా తీర్చిదిద్దడానికి శ్రమిస్తున్న భాష్యం చైర్మన్ రామకృష్ణ కృషి ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవా నర్సరీని సందర్శించిన అగ్రికల్చరల్ విద్యార్థులు

కడియం, మార్చి 16: సత్యదేవా నర్సరీని శనివారం విజయవాడ కేఎల్ కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్ విద్యార్థులు 150 మంది బీఎస్సీ (అగ్రికల్చరల్) విద్యార్థులు సందర్శించారు. వారికి నర్సరీ అధినేత పుల్లా అబ్బులు, ఆయన తనయులు పుల్లా రాజశేఖర్, వీరబాబులు విద్యార్థులకు మొక్కల నిర్వహణ, గ్రాఫ్టింగ్ విధానం, ఇంపోర్ట్, ఎక్స్‌పోర్టు వివరాలను తెలిపారు. సత్యదేవా నర్సరీ సర్టిఫికెట్ ఆఫ్ అప్రిషియేషన్‌ను విద్యార్థులకు అందజేశారు. విజయవాడ కెల్ కాలేజీ ఆఫ్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ డాక్టర్ గౌతమ్‌కిషోర్, డాక్టర్ ఉదయభాస్కర్, డాక్టర్ శివానందన్, డాక్టర్ సాగరిక పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్

రాజానగరం, మార్చి 16: రానున్న సార్వత్రిక ఎన్నికల నియమావళిలో భాగంగా జిల్లా కలెక్టర్ మాధవీలత శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను రాజానగరం తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత అధికారులు వీక్షించారు. ఈఆర్వో, ఆర్డీవో చైత్ర వర్షిణి, రాజానగరం తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ మస్తానా, కోరుకొండ తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌సునీత వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

గోకవరం, మార్చి16: రానున్న ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని గోకవరం ఎస్ఐ కె.నా గరాజు అన్నారు. గోకవరం పరిసర ప్రాంతాలలో శనివారం పోలీస్ కవాతు నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును ప్రతిఒక్కరూ నిర్భయంగా వినియోగించుకునేందుకు ప్రజల్లో భరోసా నింపడమే కవాతు ముఖ్య ఉద్దేశమని ఎస్ఐ నాగరాజు పేర్కొన్నారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు తొలగించాలి

కడియం, మార్చి 16: కడియం మండలంలో గ్రామాల్లో ఉన్న మత, కుల, రాజకీయపార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, బ్యానర్లు, కటౌట్లు, జెండాలు వంటివాటిని ఏర్పాటుచేసిన వారు స్వచ్ఛందంగా తీసేయాలని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. ఏర్పాటుచేసిన వారు తొలగించకపోతే ఎన్నికల కోడ్ అమలు కారణంగా పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది వాటిని తొలగించాలని ఆదేశాలు చేశారు. ప్రభుత్వ కార్యాలయంలో కూడా రాజకీయ సంబంధమైన బ్యానర్లు, ఫ్లెక్సీలు తీసేయాలన్నారు.

'టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి'

రాజానగరం, మార్చి 16: ఈనెల 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని రాజానగరం మండల విద్యాశాఖాధికారులు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌లు తెలిపారు. ఈసందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రాజానగరం హైస్కూల్లో 469 మంది, నరేంద్రపురం హైస్కూల్లో 162 మంది, సంపత్‌నగరం హైస్కూల్లో 183 మంది, పాతతుంగపాడు హైస్కూల్‌లో 172 మంది, దివాన్‌చెరువు హైస్కూల్‌లో 174 మంది, సూర్యాగ్లోబల్ స్కూల్‌లో 182 మంది, కానవరం హైస్కూల్‌లో 159 మంది, తోకాడ హైస్కూల్‌లో 112 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. మొత్తంగా ఈ ఏడాది 1,095మంది విద్యార్థులు పది పబ్లిక్ పరీక్షలకు హాజరవుతారన్నారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో వివిధ సబ్జెక్టుల్లో ఫెయిలైన మరో 518విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన టాయిలెట్స్‌తో పాటుగా, వైద్యశిబిరాలు, తాగునీటి సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. పరీక్షల నిర్వహణలో భాగంగా పరీక్షా కేంద్రాలవద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందని, విద్యార్థులు ఎటువంటి వత్తిడులకు లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు.

రంగంపేట : మండలంలోని వడిశలేరు, రంగంపేట, సింగంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఈనెల 18వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని మండల విద్యాశాఖాదికారి కె.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వడిశలేరు హైస్కూల్‌లో 197, రంగంపేట హైస్కూల్‌లో 211మంది, సింగంపల్లి హైస్కూల్‌లో 198 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతారన్నారు.

విద్యార్థులు పరీక్షలకు భయపడొద్దు

● డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్



రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: తాము చదివిన విషయాలు పరీక్షల్లో వస్తాయో రావో అనే ఆలోచనే పరీక్షా భయానికి మూలకారణమని కౌన్సిలింగ్ సైకో థెరపిస్ట్ డాక్టర్ పద్మాకమలాకర్ అన్నారు. ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు నేపథ్యంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పరీక్షల భయాన్ని తప్పించుకునేందుకు విద్యార్థులు తప్పటడుగుల వేస్తున్నారని, తానెంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉన్నానని, తాను చదివిన మేరకు ఏం ఇచ్చినా రాయగలనని అనుకుంటూ పరీక్షలకు వెళితే బాగా రాయగలరన్నారు.

'పరిశ్రమలు స్థాపించి ఉపాధి అవకాశాలు కల్పించవచ్చు'

దివాన్‌చెరువు, మార్చి16: విద్యార్థులు ఫార్మసీ కోర్సులు పూర్తిచేసిన తరువాత ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందడమేకాకుండా పరిశ్రమలు కూడా సొంతంగా స్థాపించవచ్చునని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వశాఖ అభివృద్ధి, ఫెసిలిటేషన్ కార్యాలయం (ఎం.ఎస్.ఎం.ఈ.-డీఎఫ్‌వో) అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.ఎల్.ఎస్.కుమార్ అన్నారు. విశాఖపట్నంలోని ఎం.ఎస్.ఎం.ఈ-డి.ఎఫ్.వో. ఆధ్వర్యంలో స్థానిక వీజే ఫార్మసీ కళాశాలలో వ్యవస్థాపకత అభివృద్ధి ప్రక్రియపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. దీనిలో కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఫార్మా పరిశ్రమలస్థాపన ద్వారా అనేకమందికి ఉపాధిని కల్పించే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ ఎస్.వి.వి.జగన్మోహనరెడ్డి, చైర్‌పర్సన్ ఎస్.శకుంతల, ప్రిన్సిపల్ డి.నరేంద్ర, డీన్ కె.శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా హేమ బాధ్యతల స్వీకరణ


రంగంపేటలోగా బాధ్యతలు చేపట్టిన ప్రిన్సిపాల్ హేమకు పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న అధ్యాపకులు

రంగంపేట, మార్చి, 16 : రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బి.హేమను నియమించినట్టు కమిషనర్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు అందాయి. శనివారం బి.హేమ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇదే కళాశాలలో బోటనీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొందటంపట్ల ఈమె ఆనందం వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ)గా వ్యహరించిన వి.శ్రీనివాసరావు జగ్గంపేట కళాశాలకు బదిలీపై వెళ్లారు. ప్రిన్సిపాల్ హేమను కళాశాల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది పుష్ప గుచ్ఛం ఇచ్చి అభినందించారు.

హుకుంపేటలో దొంగతనం

● మూడున్నర కిలోల వెండి మాయం

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హుకుంపేట వరలక్ష్మీ కాలనీకి చెందిన సత్యనారాయణ ఈనెల 29న పెద్ద కొడుక్కి పెళ్లి చేశాడు. అతడు ముంబైలోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తుండడంతో కొత్త దంపతులను తీసుకొని ఈ నెల 14న సత్యనారాయణ కుటుంబం ముంబై వెళ్లింది. అయితే, 15న స్థానికులు సత్యనారాయణకు ఫోన్ చేసి ఇంటి తలుపులు తీసి ఉన్నాయని చెప్పారు. వెంటనే ఆయన బావమరిది సన్యాసిరావుకు ఫోన్ చేసి వెళ్లి చూడమనగా.. దొంగతనం జరిగిందని గుర్తించారు. ఆయన బొమ్మూరు పోలీసులను ఆశ్రయించారు. మూడున్నర కిలోల వెండి, కొంత నగదు దోచుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎండీ ఉమర్ తెలిపారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (ఆది) సా.6.22
సహరి(సోమ) ఉ.4.48

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	36.0	23.0

మోగిన భేరీ!





(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల నగారా మోగింది.. ఎపుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఎన్నికల షెడ్యూల్ జారీ అయింది. శనివారం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ కానుంది.ఏప్రిల్ 25వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరి స్తారు. 26న పరిశీలిస్తారు.29వ తేదీ నామినేషన్ల ఉపసంహ రణకు చివరి తేదీ. మే 13న జిల్లాలో పోలింగ్ జరుగుతుంది. జూన్ 4న ఓట్లు లెక్కిస్తారు. ఇదీ ఎన్నికల ప్రక్రియ. జిల్లాలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఖరార య్యారు. రాజమహేంద్రవరం లోక్‌సభ టీడీపీ-జనసేన- బీజేపీ ఉమ్మడి అభ్యర్థి మాత్రమే ఇంకా ఖరారు కావాల్సి ఉంది.జిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికా రిగా ఉన్న జిల్లా కలెక్టర్ డా.కె.మాధవీలత వ్యవహరిస్తు న్నారు. పోలింగ్‌కు 1569 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశా రు. అందులో 30 అతిసమస్యాత్మక, 306 సమస్యాత్మక కేంద్రాలు ఉండగా మిగతా 1263 సాధారణ కేంద్రాలుగా గుర్తించారు.ఎన్నికల నిర్వహణకు 9809 మంది ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. ప్రిసైడింగ్ ఆఫీసర్లు 1569, అసిస్టెంట్ ప్రిసై డింగ్ ఆఫీసర్లు 1569,పోలింగ్ అధికారులు 6276,మైక్రో అబ్జర్వర్లు 395 మందిని సిద్ధం చేశారు. నన్నయ్యవర్సిటీలో రిసెప్షన్ కేంద్రం, నియోజకవర్గాలవారీ స్ట్రాంగ్‌రూమ్‌లు తదితర ఏర్పాట్లు చేశారు.





కోడ్ వచ్చిన వెంటనే రాజమహేంద్రవరంలో అధికార వైసీపీ, టీడీపీ నాయకుల ఫ్లెక్సీలను తొలగించారు.. ఇంకా సీఎం జగన్ ఫ్లెక్సీలు మాత్రం తీయలేదు..

- అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- ఏప్రిల్ 18న నోటిఫికేషన్ జారీ
- 25వ తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- మే 13న పోలింగ్..జూన్ 4న లెక్కింపు
- జిల్లాలో 1569 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికలకు 9809 మంది సిబ్బంది
- తుది ఓటర్ల జాబితా విడుదల

జిల్లా ఓటర్లు 16,05,762

మే 13న జరిగే ఎన్నికలకు ఓటర్ల జాబితా సిద్ధమైంది. తుది జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 16,05,762 మంది ఓటర్లు ఉన్నారు. పురుషులు 7,85,142 మంది, మహిళలు 8,20,515 మంది, థర్డ్ జండర్ 105 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 35,373 మంది ఎక్కువగా ఉన్నారు.ఇక జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అత్యధిక ఓటర్లు ఉన్న నియోజకవర్గంగా రాజమహేంద్రవరం రూరల్.. అత్యల్ప ఓటర్లు ఉన్న నియోజకవర్గం కొవ్వూరు నమోదైంది. ఓటర్ల తుది జాబితా ప్రకటించినప్పటికీ నామినేషన్లు చివరిరోజు వరకూ ఓటు నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది.

నియోజకవర్గం	ఓటర్లు	పురుషులు	మహిళలు	థర్డ్‌జండర్
రాజమండ్రిరూరల్	2,71,159	1,32,531	1,38,604	24
కొవ్వూరు	1,83,405	89,442	93,958	5
రాజమండ్రిసిటీ	2,60,360	1,25,639	1,34,663	58
గోపాలపురం	2,41,798	1,18,783	1,23,008	7
అనపర్తి	2,23,255	1,09,323	1,13,930	2
రాజానగరం	2,13,911	1,05,824	1,08,083	4
నిడదవోలు	2,11,874	1,03,600	1,08,269	5

రూ.50 వేలు మించి నగదు తీసుకెళితే సీజ్

- కటౌట్లు, హోర్డింగ్‌లు తొలగించాలి
- ఉద్యోగులు నేతలకు దూరంగా ఉండాలి
- జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని.. వీటిని కచ్చితంగా అమలు చేయాలని, అందరూ పాటించాలని జిలా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె.మాధవీలత స్పష్టం చేశారు. కలెక్టరేట్ నుంచి శనివారం సార్వత్రిక ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం సంబంధిత అన్ని విభాగాల అధికారులు,సిబ్బంది వెంటనే వారికి నిర్దేశించిన ఎన్నికల, అనుబంధ కార్యకలాపాలు చేపట్టాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని హెచ్చరించారు.ప్రతి వాహనానికి జీపీఎస్ ఏర్పాటు చేయడానికి జిల్లా రవాణా అధికారిని సంప్రదించాలన్నారు. స్టాస్టిటిక్ సర్వైవల్ బృందాలు, బోర్డర్ టీమ్స్ వెంటనే విధులు మొదలు పెట్టాలన్నారు. వ్యక్తిగతంగా ఎవరూ రూ.50 వేలుకు మించి నగదు తీసుకెళ్లడా నికి అనుమతి లేదని, ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తాలను తీసుకుని వెళితే సీజ్ చేస్తామన్నారు. మంత్రులు, రాజకీయ నేతల పాల్గొనే సమీక్షలు, సమావేశాలకు ప్రభుత్వ అధికారులు ,సిబ్బంది వ్యక్తిగతంగా కానీ, సమష్టిగా గానీ, హాజరు కా కూడదని,వారితో కలవకూడదన్నారు. కార్యాలయాల్లో మాత్రమే రాజకీయ పార్టీల ప్రతినిధులను అధికారిక విధుల కింద మాత్రమే కలవాలని స్పష్టం చేశారు.ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు, వాటి అభ్యర్థుల విషయంలో కచ్చితంగా మార్గదర్శకాలు పాటించాలని, సైరన్ కలిగిన పైలెట్ కారుతో మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు, పర్యటించకూడదని చెప్పారు.కోడ్ కారణంగా 24 గం టల్లో ప్రభుత్వ ఆస్తులపై వాల్ రైటింగ్‌లు, పోస్టర్లు, పేపర్లు, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు తొలంగించాలని ఆదేశించారు. రాబోయే 48 గంట ల్లోపు అన్ని చోట్లా ప్రభుత్వ ప్రకటనలు,హోర్డింగ్‌లు తొలగించాలని ఆదేశించారు. నిర్ణీత రుసుం చెల్లించి ప్రదర్శించిన వాటిని కొనసాగించవచ్చన్నారు. ప్రభుత్వ ఖజానా ఖర్చుతో ప్రభుత్వం సాధించిన విజయాలను చూపే ప్రకటలను మీడియాలో నిలిపివేయాలన్నారు. కేంద్ర, జిల్లా ఎన్నికల సంఘానికి నియమావళి ఉల్లంఘించినట్టు వచ్చిన ఫిర్యాదులు, ఇప్పటికే ప్రారంభించిన పనులు, ప్రారంభించని పనుల జాబితాపై 72 గంటల్లోపు నివేదిక అందజేయాలన్నారు. ప్రభుత్వ భవనా లపై,రాజకీయనేతలు చి త్రాలు, ఫొటోలు ఉండకూ డదన్నారు. మంత్రులకు ప్రభుత్వ అతిథి గృహాల్లో వసతి కల్పించకూడదని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల సమయంలో ప్రభావాన్ని చూపడానికి ప్రయత్నిస్తే ప్రజాప్రాతినిధ్య చట్టం కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేసే వాహనాల మీద ప్రద ర్శించే ఫొటోలను మూసి ఉంచాలన్నారు. ఉపాధి హామీ పథకం చేపట్టే జాబ్‌కార్డ్ ఉపాధి అవకాశాలు కొనసాగించవచ్చని చెప్పారు.ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వర్తించి,మార్గదర్శకాలు పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ పి.జగదీశ్ మాట్లాడుతూ గత ఎన్నికల్లో జరిగిన ఘటనలను దృష్టిలో ఉం చుకుని జాగ్రత్తగా విధులు నిర్వహించాలని చెప్పా రు.అభ్యర్థులు ఉపయోగించే వీడియో వాహనాలకు ముందస్తు అనుమతి పొందాలని స్పష్టం చేశారు.



కోడ్ కూసిన రోజే...

రాజమహేంద్రవరం, మార్చి 16 (ఆంధ్రజ్యోతి)/నిడదవోలు : ఎన్నికల నియమావళి శనివారం సాయంత్రం అమల్లోకి వస్తుందని తెలియడంతో వైసీపీ నాయకులు రోజు రోజంతా హడావుడిగా నియోజకవర్గాలను చుట్టేశారు. వైసీపీ సిటీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ ఉదయం నుంచీ తీరిక లేకుండా గడిపారు. 10, 41, 45, 46 వార్డుల్లో సీసీ, బీటీ రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేసి శిలాఫల కాలను ఆవిష్కరించారు. రాజానగరం వైసీపీ అభ్యర్థి,సిట్టింగ్ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ఆ నియోజకవర్గంలో పలు శంకుస్థాపనలు చేశా రు.సాయంత్రం వరకూ లబ్ధిదారులకు ఇళ్ల స్థలా ల పట్టాలు పంపిణీ చేశారు. మంత్రి, రాజ మహేంద్రవరం వైసీపీ రూరల్ అభ్యర్థి చెల్లుబో యిన వేణు తన నూతన కార్యాలయాన్ని ప్రా రంభించి భోజనాలు పెట్టారు. 22 మంది ఆరో గ్యశ్రీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. నిడదవోలులో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు విలేకరులు ఒక్కొక్కరికీ కొత్త బట్టలు ఇచ్చి రూ.5 వేల నగదు అంద జేశారు. కోరుమామిడిలో వలంటీర్లకు రూ.3 వేలు విలువ చేసే వెండిగిన్నె అందజేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన తొలిరోజే వైసీపీ నాయకులు ఉల్లంఘించేశారు.



నిడదవోలులో ఎమ్మెల్యే పంచిన దుస్తులు, నగదు

ఫ్యాన్‌కు పాత రెక్కలే..



తానేటి వనిత | సీహెచ్.వేణు గోపాలకృష్ణ | మార్గాని భరత్ రామ్ | జక్కంపూడి రాజా | జి.శ్రీనివాస్ నాయుడు | సత్తి సూర్య నారాయణరెడ్డి | తలారి వెంకటరావు

ప్రజలు వ్యతిరేకించినా.. మళ్లీ సిట్టింగ్‌లకే..

- ఉమ్మడి జిల్లాలో 22 సీట్లు ప్రకటన
- నాలుగు స్థానాల్లో సిట్టింగ్‌లు ఔట్
- మిగిలిన సీట్లలో సిట్టింగ్‌లకే ఛాన్స్
- ముగ్గురు మంత్రుల్లో ఒకరి స్థానం మార్పు
- 12 స్థానాల్లో ఓసీలను నిలబెట్టిన వైసీపీ
- ఎస్సీలకు 5, బీసీలకు 4 స్థానాలే
- కాకినాడ పార్లమెంట్‌లో బీసీలకు నో ఛాన్స్
- రాజోలు సీటుపై రాపాక గోడు వినని వైసీపీ
- ఎంపీగా అయిష్టంగానే బరిలోకి
- ఆలస్యంగా వచ్చిన గొల్లపల్లికి టిక్కెట్
- రాపాకకు చెక్ పెట్టిన అధిష్ఠానం
- అమలాపురం ఎంపీకి అవమానం
- ఎక్కడా టిక్కెట్ కేటాయించని అధికార పార్టీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్ని అసెంబ్లీ, ఎంపీ స్థానాల్లో అధికార వైసీపీ ఎట్టకేలకు అభ్యర్థులను ప్రకటించింది. ఓటమి భయంతో ఇన్నాళ్లు అనేక స్థానాల్లో ఎవరు బరిలో ఉంటారో తేల్చలేక సతమతమైన ఫ్యాన్ పార్టీ పలు స్థానాల్లో రాజీపడింది. అక్కడ అభ్యర్థులను మార్చాలని భావించినా ఎక్కడ మళ్లీ కొత్త తలనొప్పులు వస్తాయోనన్న భయంతో కొంత తగ్గింది. చేసేదిలేక అనేక స్థానాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలకే దాదాపు మొగ్గు చూపింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లాలో 19 అసెంబ్లీ, పశ్చిమ నుంచి కొత్త తూర్పుగోదావరి జిల్లాలో కలిసిన మూడు స్థానాలు వెరసి మొత్తం 22 స్థానాలకు ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, పి.గన్నవరం స్థానాల్లో ప్రస్తుత ఎమ్మెల్యేలను తప్పించి వారి స్థానాల్లో కొత్త అభ్యర్థులను బరిలో నిలబెట్టింది. ముగ్గురు మంత్రుల్లో ఒకరిని రామచంద్రపురం నుంచి తప్పించి రాజమహేంద్రవరం రూరల్ నుంచి పోటీలోకి దింపింది. మిగిలిన ఇద్దరు మంత్రులు విశ్వరూప్, దాడిశెట్టి రాజా యథాతథంగా వారి స్థానాల్లోనే బరిలో ఉన్నారు. మంత్రి విశ్వరూప్‌ను మార్చాలని ప్రయత్నించినా ప్రత్యామ్నాయం లేక తిరిగి ఆయన్నే కొనసాగించింది. రాజోలు స్థానంపై మరోసారి పునరాలోచించాలని ఎమ్మెల్యే రాపాక తిరగబడ్డా వైసీపీ పట్టించుకోలేదు. కాకినాడ జిల్లాలో వైసీపీ ఒక్క బీసీకి కూడా అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వకుండా మొత్తం ఓసీలతో నింపేయడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. రాజమహేంద్రవరం పార్లమెంట్‌లో చెరో రెండు సీట్లు బీసీ, ఎస్సీలకు, మూడు సీట్లు ఓసీలకు కట్టబెట్టింది. అమలాపురం పార్లమెంట్ పరిధిలో మూడు సీట్లు ఎస్సీ, చెరో రెండు బీసీలు, ఓసీలకు కట్టబెట్టింది. వెరసి రంపచోడవరంతోపాటు మూడు పార్లమెంట్ స్థానాల పరిధిలో మొత్తం 21 సీట్లకు 12 స్థానాల్లో ఓసీలకు పెద్దపీట వేయగా 10 మంది అభ్యర్థులు కాపు సామాజికవర్గం నుంచి ఉన్నారు. మూడు ఎంపీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించిన వైసీపీ అమలాపురం సిట్టింగ్ ఎంపీ అనురాధకు మొండిచేయి చూపింది.

బీసీలకు అన్యాయమే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 22 స్థానాల్లో అధికార వైసీపీ మెజార్టీ సీట్లు ఓసీలకే కట్టబెట్టింది. మాట్లాడితే నా ఎస్సీలు, నా బీసీలు అంటూ మాటలు వల్లె వేసే వైసీపీ అధ్యక్షుడు జగన్ సీట్ల కేటాయింపులో మాత్రం సామాజిక సమతూకం పెద్దగా పాటించకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఎన్నికల్లో అయినా బీసీలకు ప్రాతినిధ్యం పెంచాలని డిమాండ్లు వచ్చినా వైసీపీ పెద్దగా పట్టించుకోలేదు. మొత్తం 22 సీట్లకు 12 స్థానాల్లో ఓసీలకు పెద్దపీట వేశారు. సగానికిపైనే సీట్లు కట్టబెట్టారు. ఓసీలకు ఇచ్చిన 12 సీట్లలో పది మంది అభ్యర్థులు కాపు సామాజికవర్గం నుంచే ఉన్నారు. ముఖ్యంగా కాకినాడ పార్లమెంట్ స్థానం పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ సీట్లు ఉండగా అన్నీ ఓసీలకే కట్టబెట్టారు. ఇందులో ఆరు సీట్లు కాపు సామాజికవర్గం నుంచి ఒక సీటు రెడ్డి సామాజికవర్గం నుంచి ఉన్నాయి. వాస్తవానికి కాకినాడ పార్లమెంట్ పరిధిలో ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో మూడు సీట్లు టీడీపీ బీసీలకు ఇస్తోంది. 2019 ఎన్నికల్లో తుని, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ స్థానాల్లో బీసీ అభ్యర్థులను టీడీపీ నిలబెట్టింది.కానీ వైసీపీ ఒక్కరికీ చోటు కల్పించలేదు. ఈ సారి అదే విధానం పాటించి బీసీలకు అన్యాయం చేసింది. రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానంలో చెరో రెండు సీట్లు బీసీ, ఎస్సీలకు, మూడు సీట్లు ఓసీలకు కట్టబెట్టింది. అమలాపురం పార్లమెంట్ పరిధిలో మూడు సీట్లు ఎస్సీ, చెరో రెండు బీసీలు, ఓసీలకు కట్టబెట్టింది. తద్వారా మొత్తం 22 సీట్లలో 12 మంది ఓసీలు, అయిదు స్థానాలు ఎస్సీ, నాలుగు స్థానాల్లో మాత్రమే బీసీలకు ప్రాతినిధ్యం కల్పించింది.

వెంటాడుతున్న ఓటమి భయం..

వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజా వ్యతిరేక, నియంతృత్వ విధానాలతో పాలన సాగించింది. ఒక పక్క పన్నుల వాత.. మరోపక్క నవరత్నాల పేరుతో లబ్దిదారుల్లో కోత జనాలను అడుగడుగునా మోసం చేసింది. దీనికితోడు ఎక్కడికక్కడ అధికారపార్టీ నేతల విచ్చలవిడి అవినీతి, బెదిరింపులు, దందాలు, దౌర్జన్యాలకు అంతులేకుండా పోయింది. ఉద్యోగుల విషయంలోనూ వారిని నానా వేధింపులకు గురిచేశారు. ఈ నేపథ్యంలో వైసీపై పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో విసుగొచ్చేసింది. ఎన్నికలు దగ్గరపడ్డ తరుణంలో పార్టీ ఎమ్మెల్యేలు భారీగా ఓడిపోతారనే భయం అధికార పార్టీని వెన్నాడింది. ఎక్కడికక్కడ నియోజకవర్గాల్లో ఐప్యాక్ సర్వేల్లో వైసీపీపై తీవ్ర వ్యతిరేకత ఉన్నట్టు తేలింది. దీంతో గడచిన నాలుగు నెలలుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలువురు ఎమ్మెల్యేలను సర్వే పేరుతో పక్కన పెట్టడం మొదలుపెట్టింది. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇస్తే ఓడిపోతారంటూ వారిని తప్పించింది. అందులో భాగంగా కాకినాడ పార్లమెంట్ పరిధిలో ప్రత్తిపాడు, పిఠాపురం, జగ్గంపేట, అమలాపురం పార్లమెంట్ పరిధిలో పి.గన్నవరం స్థానాల్లో ఎమ్మెల్యేల టిక్కెట్లు చింపేసింది. వారి స్థానాల్లో కొత్త ఇన్‌చార్జులను నియమించింది. అయితే వీరిపైనా వ్యతిరేకత పెద్దగా తగ్గలేదని తేలడంతో తలపట్టుకుంది. అమలాపురంలో మంత్రి విశ్వరూప్ పనితీరుపై అసంతృప్తి వ్యక్తంకావడంతో ఆయన్ను తప్పించాలనుకుంది. విశ్వరూప్, ఆయన తనయుడిని తాడేపల్లికి పిలిపించుకుని పార్టీ పెద్దలు మాట్లాడారు. తనకు సీటు ఖాయమైపోయిందని విశ్వరూప్ తనయుడు ప్రచారం చేసుకోవడంతో నియోజకవర్గంలో విభేదాలు మొదలయ్యాయి. తీరా ఇవి ఎక్కడి వరకు పోతాయో తెలియక చేసేదిలేక మళ్లీ విశ్వరూప్‌నే కొనసాగించింది. రామచంద్రపురం సీటు నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి వేణుకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని సర్వేలో తేలింది. అదే సమయంలో టిక్కెట్ తమకు ఇవ్వాలంటూ ఎంపీ బోస్ పట్టుబట్టారు. లేదంటే పార్టీని వీడిపోతానని సంకేతాలు పంపారు. మంత్రి వేణు అవినీతిపై జగన్‌కు బోస్ ఆధారాలతో సహా ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వేణును రాజమహేంద్రవరం రూరల్ సీటుకు పంపేశారు. రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌కు ఓటమి తప్పదని సర్వేలో తేలింది. దీంతో ఆయన్ను రాజమహేంద్రవరం సిటీ స్థానానికి జగన్ బదిలీ చేశారు. అటు కొవ్వూరు ఎమ్మెల్యే వనితను గోపాలపురం, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావును కొవ్వూరుకు సీట్లు మార్చి వ్యతిరేకత తప్పించుకునేందుకు వైసీపీ ప్రయత్నించింది. ఇటు కొత్తపేట, కాకినాడ సిటీ, పెద్దాపురం, జగ్గంపేట, ముమ్మి డివరం స్థానాల్లో అభ్యర్థుల్లో మార్చాలని భావించింది. కానీ అక్కడ పోటీకి దీటైన అభ్యర్థులు లేకపోవడం, మరికొందరు ఎమ్మెల్యేలైతే తమకు టిక్కెట్ నిరాకరించినా, వేరే స్థానానికి మార్చినా పార్టీని వీడిపోతామనే హెచ్చరికలు పంపారు. ఈ నేపథ్యంలో చేసేదిలేక వారిని అయిష్టంగా కొనసాగిస్తూ శనివారం జాబితా వెల్లడించింది. ఇదిలా ఉంటే రాజోలు ఎమ్మెల్యే రాపాక తనకు ఈసారి వైసీపీ నుంచి సీటు ఖాయం అని ఇంత కాలం ధీమాగా ఉన్నారు. తీరా టీడీపీ నుంచి టికెట్ ఆశించిన మాజీ మంత్రి గొల్లపల్లి అనూహ్యంగా అక్కడ టిక్కెట్ దొరక్క వైసీపీలో చేరిపోయారు. ఫలితంగా ఈయనకు వైసీపీ రాజోలు టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో రాపాక భగ్గుమన్నారు. తనను రాజోలు నుంచి తప్పించి అమలా పురం ఎంపీ అభ్యర్థిగా పంపడంపై గుర్రుగా ఉన్నారు. పార్టీపై తీవ్ర వ్యతిరేకత ఉన్న నేపథ్యంలో తనను ఎంపీ అభ్యర్థిగా పంపి వైసీపీ దగా చేసిందని.. అఖరి నిమిషంలోనైనా తనను రాజోలు పంపాలని కోరినా పార్టీ పట్టించుకోకపోవడంతో కారాలు మిరియాలు నూరుతున్నారు. రంపచోడవరం నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే ధనలక్ష్మిని తిరిగి కొనసాగించారు. మరోపక్క కాకినాడ ఎంపీగా చలమశెట్టి సునీల్, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిగా గూడూరు శ్రీనివాస్‌ను ప్రకటించారు. అయితే మొత్తం అసెంబ్లీ, ఎంపీ స్థానాలకు వైసీపీ అభ్యర్థులందరినీ ఖరారు చేసినా అనేక మంది నేతల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేల పరిస్థితి ఇంత దారుణంగా ఉండగా, సీటు బదిలీపై వచ్చినవారు సొంతపార్టీ కుంపట్లతో తలపట్టుకుంటున్నారు.

వైసీపీ వర్సెస్ టీడీపీ

ఒకపక్క వైసీపీ వెల్లడించిన ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థుల్లో మెజార్టీ స్థానాల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నా వారిని మార్చలేక అధిష్ఠానం చతికిలబడింది. దీంతో ఇందులో ఎక్కువ స్థానాల్లో ఓటమి తప్పదనే విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. మరోపక్క టీడీపీ కూటమి మాత్రం గెలుపు గుర్రాలే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికను దాదాపు పూర్తిచేసింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 19 సీట్లలో ఒక్క కాకినాడ సిటీ, అమలాపురం స్థానాల్లో మాత్రమే అభ్యర్థుల ప్రకటన పెండింగ్‌లో ఉంది. ఇప్పటివరకు ప్రకటించిన స్థానాల్లో సమర్థవంతమైన అభ్యర్థులతోపాటు సామాజిక సమీకరణాలు పక్కాగా పాటించింది. బీసీలు, ఎస్సీలు, ఓసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పిస్తూ అన్ని వర్గాలను ఆకట్టుకుంది. ఒకపక్క వైసీపీ, మరోపక్క టీడీపీ కూటమి సీట్లపై తొంభై శాతం స్పష్టత వచ్చేసిన నేపథ్యంలో రేపటి నుంచి జిల్లాలో ఇరుపార్టీల అభ్యర్థులు నువ్వానేనా అన్నట్లు తలపడనున్నారు. ఇక అధికార ప్రతిపక్షాల మధ్య అసలు సిసలు రాజకీయ పోరు ఆరంభం కానుంది.కాగా టీడీపీ కూటమి త్వరలో మూడు పార్లమెంట్ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించనున్నాయి.

శేషారావును కలిసిన దుర్గేష్



నిడదవోలు, మార్చి 16 : నిడదవోలు వివాదం సద్దుమణిగింది.. ఎన్నికల పొత్తులో భాగంగా జనసేన పార్టీ అభ్యర్థి కందుల దుర్గేష్‌కు తెలుగుదేశం, జనసేన, బీజేపీల నిడదవోలు ఉమ్మడి అభ్యర్థిగా అధిష్ఠానం ప్రకటించింది.దీంతో ఇప్పటి వరకు టీడీపీ నిడదవోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అలకబూనారు. టీడీపీ కార్యకర్తలు శేషారావుకే టిక్కెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. నిరసన ప్రదర్శనలు చేశారు. ఇదిలా ఉండగా కందుల దుర్గేష్ శనివారం ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కాసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు. సోమవారం టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటానని శేషారావు తెలిపారు.

నేడు 25 కేంద్రాల్లో గ్రూప్-1 పరీక్ష

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష ఆదివారం నిర్వహించనున్నట్టు కలెక్టర్ మాధవీలత తెలిపారు. అభ్యర్థులు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూమ్ ఫోన్ నెం.89779 35609లో సంప్రదించాలన్నారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఆ నెంబరు పని చేస్తుందన్నారు. ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు సంబంధించి జిల్లాలోని 25 పరీక్షా కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. సీసీటీవీల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణ ఉంటుందన్నారు. ఉదయం జరిగే పరీక్షలకు ఉదయం 9.45 గంటల వరకూ, మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.45 గంటల వరకూ మాత్రమే అభ్యర్థులకు పరీక్షా హాలులోకి అనుమతి ఉంటుందన్నారు. ఆ తర్వాత అనుమతి ఉండదన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఒక ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు.హాల్‌టికెట్‌లో ఫొటో లేకపోయినా, సరిగా ప్రింట్ కాకపోయినా గెజిటెడ్ అధికారి సంతకంతో పాటు మూడు పాస్‌పోర్టుసైజు ఫొటోలతో పరీక్షకు హాజరు కావచ్చని తెలిపారు.

రేపటి నుంచి పది పరీక్షలు

జిల్లా నుంచి 29,990 మంది విద్యార్థుల హాజరు

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఈ మేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని పరీక్షలకు హాజరయ్యే 29,990 మంది విద్యార్థుల కోసం 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకూ పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ఉదయం 10 గంటల తర్వాత అనుమతి ఉండదని పేర్కొన్నారు. విద్యార్థులు సమయాలకు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా ప్రణాళిక చేసుకోవాలన్నారు. ఎస్పీ జగదీశ్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తారన్నారు. పిల్లలు ఎక్కడా ఇబ్బంది పడకుండా కలెక్టర్ ఆదేశాలతో ఏర్పాట్లు చేశామని, ఒత్తిడికి గురవ్వకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని జిల్లా పాఠశాల విద్య అధికారి వాసుదేవరావు కోరారు. తాగునీరు, అత్యవసర మెడిసిన్ వంటి సదుపాయాలను అందుబాటులో ఉంచామన్నారు. పరీక్షా సమయానికి అరగంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తారసపడి సహాయం కోరితే సమాజిక బాధ్యతగా భావించి వారిని పరీక్షా కేంద్రాల వద్దకు చేర్చడంలో ఆటోవాలాలతోపాటు వాహనదారులు సహరించాలని ఆయన అభ్యర్థించారు. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షలు జరిగే తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్టు రాజమహేంద్రవరం డిపోమేనేజర్ ఎస్‌కే షబ్నం తెలిపారు. పరీక్ష తేదీల్లో నివాస గ్రామం నుంచి పరీక్షా కేంద్రానికి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చని, విద్యార్థులు బస్సు కండక్టర్లకు తమ హాల్ టిక్కెట్లు చూపించాలన్నారు. ఈనెల 18వ తేదీ నుంచి 30వ తేదీ వరకూ మాత్రమే ఇది వర్తిస్తుందని తెలిపారు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

రాక్షస పాలన నుంచి విముక్తి : మద్దిపాటి



నల్లజర్ల,మార్చి 16: రాష్ట్రంలో ప్రజలకు రాక్షస పాలన నుంచి విముక్తి ఎన్నికల నోటిఫికేషన్ ద్వారా లభించిందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు అన్నారు. శనివారం నల్లజర్ల పార్టీ కార్యాలయంలో జరిగిన టీడీపీ మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో 45 రోజులు రాష్ట్ర ప్రజలకు పూర్తి స్వేచ్ఛ లభిస్తుందన్నారు. జగన్‌ను ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, జగన్‌రెడ్డి ఐదేళ్ల విధ్వంసక, విద్వేష పాలనతో రాష్ట్రాన్ని అన్ని విధాల సర్వ నాశనం చేశారన్నారు. జగన్‌కు ఓటెయొద్దని సొంత చెల్లెల్లే చెబుతున్నారని, ఎస్సీ, ఎస్టీలకు చెందిన 28 పథకాలు, బీసీలకు చెందిన 30 పథకాలు, మైనార్టీలకు చెందిన 11 పథకాలు రద్దు చేసి వందలాది మందిపై మారణహోమం సృష్టించిన జగన్ పాలనకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, యద్దనపూడి బ్రహ్మారాజు, యలమాటి శ్రీనివాసరావు, పసుమర్తి రతీష్, నిమ్మలపూడి ప్రసాద్, కండెపు వెంకటరత్నం పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు హాల్ టిక్కెట్లు

కొవ్వూరు, మార్చి 16: పదో తరగతి విద్యార్థులకు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి హాల్‌టిక్కెట్లు పంపిణీ చేశారు. కొవ్వూరు మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వి.గంగభవాని ఆధ్వర్యంలో శనివారం పదో తరగతి విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు, పరీక్షా మెటీరియల్ పంపిణీచేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మాట్లాడుతూ ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణులవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో రక్తదాన శిబిరం



రక్తదాతకు సర్టిఫికెట్‌ను అందిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరావు

తాళ్లపూడి, మార్చి 16: తాళ్లపూడిలోని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సహకారంతో ప్రెస్‌క్లబ్, నందన ఫౌండేషన్, దేవోక్తి సోషల్ సర్వీస్, జనహిత సేవాసమితి, మానవత రక్తనిధి డైరెక్టర్ జోడాల వెంకటేశ్వరరావు నిర్వహణలో జరిగిన ఈ శిబిరాన్ని గోకవరపు బాబులు ప్రారంభించారు. 63 మంది దాతలు రక్తదానం చేశారు. అలాగే స్థానిక సాయిస్ఫూర్తి హాస్పిటల్ ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిన్న వయస్సులోనే 15వ సారి రక్తదానం చేసిన రజాక్‌ను పలువురు అభినందించారు. కార్యక్రమంలో సాయిస్ఫూర్తి డీఈవో విజయరాజు, తహశీల్దార్ శ్రీనివాసరావు, ప్రెస్‌క్లబ్ సభ్యులు, పలు సేవా సంస్థల ప్రతినిధులు దేవరపల్లి రవి, ప్రత్తిపాటి అబేద్నిగో, రవి, పాల్గొన్నారు.

రాజకీయ నాయకుల ఫొటోలకు పరదాలు

గోపాలపురం, మార్చి 16: కొన్ని రోజులుగా ఇటు ప్రజలు, అటు నాయకులు, అధికారులు ఆత్రుతగా ఎదురు చూస్తున్న సాధారణ ఎన్నికల కోడ్ రానేవచ్చింది. ఎన్నికల కోడ్ ఎప్పుడు వస్తుందా.. ఈ పని భారం ఎప్పుడు తగ్గుతుందా అని గంపెడు ఆశతో ఎదురుచూసిన ఉద్యోగులకు ఊపిరి పీల్చుకున్నట్టయ్యింది. ఇదిలా ఉంటే శనివారం 3గంటలకు ఎన్నికల కోడ్ అమలులోకి వస్తుందని రెండురోజులుగా ఈసీ ఇస్తున్న ప్రకటనలతో అధికారులు సుమారు 11గంటల తరువాత ఆయా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ముఖ్యమంత్రి చిత్రపటాలు, రాజకీయ నాయకులతో ముద్రించబడిన క్యాలెండర్లను తొలగించారు. వీటితో పాటు ప్రభుత్వ కార్యాలయం వద్ద ఉన్న శిలాఫలకాలపై ముద్రించిన ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే తదితర ఫొటోలను కనబడకుండా కప్పివేశారు.

వేగేశ్వరపురం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా శ్రీనివాస్

తాళ్లపూడి, మార్చి 16: మండలంలోని వేగేశ్వరపురం జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్‌గా గరగ శ్రీనివాస్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కొవ్వూరులోని బాలుర కళాశాల నుంచి బదిలీ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనకు కళాశాల సిబ్బంది పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

టీకాలతో ఆరోగ్యానికి భద్రత

నల్లజర్ల, మార్చి 16: పలు రకాలైన వ్యాధులకు పాశుపతాస్త్రంగా పని చేసే టీకాలు వేసుకోవడం వల్ల ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ తెల్లం గంగాధరరావు అన్నారు. జాతీయ టీకా దినోత్సవం సందర్భంగా శనివారం నల్లజర్లలో చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీకాల వల్ల దీర్ఘకాలిక వ్యాధుల నుంచి సంరక్షణతోపాటు రోగనిరోధ శక్తి తక్కువగా ఉన్నవారికి ఎంతో మేలు చేస్తాయన్నారు. చిన్నారులకు తల్లి పాలు తరువాత టీకాలే ఎక్కువ రక్షణ ఇచ్చేవి అన్నారు. కార్యక్రమంలో జీవీవీ ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి కృషి : మంత్రి వనిత



దేవరపల్లిలో కాపు కల్యాణ మండపానికి భూమిపూజ చేస్తున్న మంత్రి వనిత

దేవరపల్లి, మార్చి 16: కాపుల సంక్షేమానికి వైఎస్ జగన్ అన్ని రకాలుగా కృషి చేశారని మంత్రి తానేటి వనిత అన్నారు. దేవరపల్లిలో కాపు కల్యాణ మండపం నిర్మాణానికి మంత్రి భూమి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తానేటి వనిత మాట్లాడుతూ కాపు సంక్షేమానికి ప్రభుత్వం ఐదేళ్లలో రూ.33,623 కోట్లు ఖర్చు చేసిందన్నారు. జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు మాట్లాడుతూ కల్యాణ మండపం నిర్మాణానికి మంత్రి సహకరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, కాపు సంఘం నాయకుడు చినమిల్లి వెంకటరాయుడు, ఏఎంసీ ఛైర్మన్ గన్నమని జనార్దనరావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, కూచిపూడి సతీష్, రామాంజనేయులు, దుగ్గిన గంగాధర్, పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముప్పిడి పూజలు



దేవరపల్లి, మార్చి 16: దేవరపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఆలయార్చకులు ప్రత్యేక ఆశీర్వాదాలు అందజేశారు. అలాగే ఆలయాన్ని మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు దర్శించుకున్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ స్థాపన



దేవరపల్లి, మార్చి 16: దేవరపల్లి మండలం యర్నగూడెంలో నిర్మించిన అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ స్థాపన శనివారం ఉదయం నిర్వహించారు. దేవరపల్లికి చెందిన శ్రీకాకుళపు కాశీవిశ్వనాథం, రోహిణి దంపతులు, గ్రామస్థుల సహకారంతో ఆలయ నిర్మాణం జరిగిందని, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు చెప్పారు. తమ తల్లిదండ్రులు మాజీ ఎంపీపీ వెంకటనరసింహారావు, సుశీల దంపతుల ప్రోత్సాహంతో ఈ ఆలయ నిర్మాణం పూర్తి చేశామన్నారు. సిద్ధాంతి రావిపాటి వెంకటప్రసాద్ మాట్లాడుతూ టీటీలో జరిగే విధంగానే ఈ ఆలయంలోనూ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఆర్థోప్లాస్టీ సదస్సు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: స్థానిక ఆర్యాపురం సాయి హాస్పిటల్‌లో రాజమండ్రి ఆర్థోపెడిక్ సర్జన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం గోదావరి ఆర్థోప్లాస్టీ సదస్సును నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహక కార్యదర్శి ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కె.విజయకుమార్ తెలిపారు. జాతీయ స్థాయిలో నిపుణులైన వైద్యులు ఈ సదస్సుకు హాజరై కీళ్ల మార్పిడి సర్జరీల్లో మెలకువలు, కొత్త పోకడలు, నైపుణ్యాల పెంపునకు అవసరమైన పరిజ్ఞానాన్ని వివరిస్తారన్నారు. రోబోటిక్ నీ రీప్లేస్‌మెంట్, హిప్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు ప్రత్యేక ప్రసారం ఉంటుందన్నారు. సదస్సుకు పలువురు ప్రముఖ డాక్టర్లు హాజరవుతారన్నారు.

ఎన్నికల నియమావళిని అమలుచేయాలి

» కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, మార్చి 16: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూ.చ తప్పకుండా అమలుపర్చాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో శనివారం ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ టీము, ఎక్స్‌పెండిచర్ మోనటరింగ్ బృందాల సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు తీరు, సీరు ప్రొసిజర్, సి-విజిల్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంటు సిస్టమ్‌పై శిక్షణ అందజేశారు. ఎన్నికల ప్రక్రియపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రూ.50 వేలకు మించి ఎవరైనా నగదు తీసుకువెళ్తే దాని పూర్తి వివరాలు తెలియజేయాలన్నారు. మోడల్ కోడ్ అమలులో భాగంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. కొత్తగా ప్రారంభించిన వాటి శిలాఫలాకాలను మూసివేయాలన్నారు. మున్సిపాల్టీ, మండల పరిషత్, పంచాయతీల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తే ముందుగా ఆర్వో అనుమతులు పొందాలన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ సమావేశాలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఓటుహక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి: సీఐ

ఎటువంటి ప్రలోభాలకు, బయాందోళనకు గురికాకుండా ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సీఐ వి.జగదీశ్వరరావు అన్నారు. శనివారం కొవ్వూరు మండలం ఆరికిరేవులలో కేంద్ర బలగాలు నిర్వహించిన కవాతును ఆయన ప్రారంభించారు. అనంతరం కొవ్వూరులోని రాజీవ్ నగర్, శ్రీరామకాలనీ, క్రిస్టియన్‌పేటలలో కవాతు చేపట్టారు. సీఐ మాట్లాడుతూ ప్రజలంతా ఎటువంటి భయం లేకుండా పోలింగ్ కేంద్రానికి వచ్చి స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో గ్రామాలు, పట్టణంలో కవాతు నిర్వహిస్తున్నామని, 100శాతం పోలింగ్ నమోదుకావాలన్నారు. ఎవరైనా ప్రలోభపెట్టినా, భయాందోళనకు గురిచేసినా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఐ జగదీశ్వరరావు చెప్పారు.

లోక్ అదాలత్‌లో 286 కేసులు పరిష్కారం



నిడదవోలు మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణ

నిడదవోలు, మార్చి 16: రాజీ పడదగిన కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన డబ్బు సమయం ఆదా అవుతాయని ప్రిన్సిపల్ జడ్జి జి.రామకృష్ణ అన్నారు. శనివారం నిడదవోలులోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి, క్రిమినల్ కేసులు 265, సివిల్ కేసులు 6, న్యాయ సేవ సంస్థ ద్వారా 15 పరిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లు సత్వర కేసుల పరిష్కారానికి దోహదపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో బెంచి కోర్టు మెజిస్ట్రేట్ నక్కా అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు సీహెచ్ విజయ్‌కుమార్, న్యాయవాదులు నందిగం సుబ్బారావు, కె.సత్యనారాణ, ఎమ్‌డి మెహబూబ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

» నిడదవోలు ప్రిన్సిపల్ జడ్జి రామకృష్ణ

కొవ్వూరులో 156 కేసులు పరిష్కారం

కొవ్వూరు, మార్చి 16: కొవ్వూరు కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 156 కేసులు పరిష్కరించినట్టు కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. అందుకు సిట్టింగ్ జడ్జిలు ఎస్.శ్రీనివాసరావు, జి.ధర్మారావు, జి.సాయికృష్ణలతో మూడు బెంచ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా వాహన ప్రమాద బీమా 14, మనోవర్తి 3, చెక్‌బౌన్స్ 5, సివిల్ 35, క్రిమినల్ 86, ప్రీటికేషన్ 13 కేసులు పరిష్కరించామన్నారు.



కొవ్వూరులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

పొట్టి శ్రీరాములు ఆంధ్రుల ఆరాధ్య దైవం



నిడదవోలులో శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేస్తున్న దుర్గేష్

నిడదవోలు, మార్చి 16: అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రుల ఆరాధ్య దైవమని, ఆంధ్రులైన ప్రతిఒక్కరూ ఉదయం లేచిన వెంటనే ఆయనకు నమస్కరించుకోవాలని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. శ్రీరాములు జయంతిని శనివారం పలుచోట్ల నిర్వహించారు. నిడదవోలులోని మెయిన్‌రోడ్డులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దుర్గేష్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆత్మబలిదానం చేసి తెలుగురాష్ట్రాన్ని తీసుకొచ్చారని, ఆ మహనీయుని ఆశయాలను ప్రతిఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో జనసేన పట్టణాధ్యక్షుడు రంగా రమేష్, వాసవీ క్లబ్ అధ్యక్షుడు బచ్చు లక్ష్మణరావు, ఉప్పల సతీష్‌తోపాటు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

» టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్

» ఘనంగా 'అమరజీవి' జయంతి.. పలువురి నివాళి

తాళ్లపూడి: తాళ్లపూడి బస్టాండ్ సెంటర్‌లో ఆర్యవైశ్య సత్రం వద్ద పొట్టి శ్రీరా ములు, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు చంద్రధరగుప్త మాట్లాడుతూ పొట్టి శ్రీములు ఆంధ్ర రాష్ట్రం కోసం 56 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసారని, గాంధీజీ ఆశయాల సాధనకు కృషి చేసిన మహనీయుడన్నారు. కార్యక్రమంలో చిరువూరి పోసిశ్రీనివాస్, చీదెళ్ల రాజు, అనంతం రాజశేఖర్, చక్కా నాగేశ్వరరావు, కొండూరి సుబ్బారావు, అనంతం లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి సర్పంచ్ కరటూరి నరేంద్రబాబు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. పాలంగిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు.

నల్లజర్ల: నల్లజర్లలో వాసవీ క్లబ్ మండలాధ్యక్షురాలు నాగలక్ష్మి ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాముల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీరాములు త్యాగం ఫలితామే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అన్నారు. అనంతరం చిన్నారులకు స్వీట్‌లు పంచారు. కార్యక్రమంలో కార్యదర్శి జ్యోతి, దుర్గాదేవి, గుళ్ళపూడి వెంకటరత్నం, నారాయణ నాగసత్య శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఉండ్రాజవరం: తాడిపర్రులో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



నల్లజర్లలో శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కొవ్వూరు, మార్చి 16: కొవ్వూరు గోష్పాదక్షేత్రం పిండాలరేవు వద్ద గోదావరి నదిలో గుర్తుతెలియని మగ మృతదేహాన్ని పోలీసులు శనివారం గుర్తించారు. నది నుంచి బయటకు తీయించి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఒంటిపై నీలం రంగుపై నలుపు గడుల షర్ట్, నాచు రంగు లుంగీ ఉన్నాయన్నారు. ఆచూకీ తెలిసిన వారు స్థానిక పట్టణ పోలీస్టేషన్‌కు సమాచారం అందించాలని సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు.

ఇళ్ల పట్టాలకు లబ్ధిదారుల నిలదీత

సెక్రటరీల ద్వారా ఇస్తామని సర్దిచెప్పి పంపేసిన అధికారులు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయానికి శనివారం మధ్యాహ్నం కొందరు మహిళలు వచ్చి తమకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదని అధికారులను నిలదీశారు. ఇటీవల స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో ఎంపీ భరత్‌రామ్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇందులో చాలామందికి పట్టాలు ఇవ్వలేదు. దీంతో కొందరు మహిళలు శనివారం కార్పొరేషన్ కార్యాలయానికి వచ్చి తమకు పట్టాలు ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో వున్నందున ఇప్పుడు ఇవ్వడం కుదరదని వార్డు కార్యదర్శుల ద్వారా పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని, అంతవరకు ఓపిక పట్టాలని కోరడంతో వారు వెనుదిరిగినట్టు తెలిసింది. చాలామంది లబ్ధిదారులు టిడ్కో ఇళ్ల కోసం, ఇళ్ల స్థలం పట్టాల కోసం ఇంకా అధికారులపై నమ్మకంతో ఉన్నారు. ఈ తరుణంలో ఎన్నికల కోడ్ అమలు రావడంతో పరిస్థితి మొత్తం తల్లకిందులైంది.

విద్యార్థులు పరీక్షలకు భయపడొద్దు..

డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: తాము చదివిన విషయాలు పరీక్షల్లో వస్తాయో రావో అనే ఆలోచనే పరీక్షా భయానికి మూలకారణమని కౌన్సిలింగ్ సైకో థెరపీస్ట్ డాక్టర్ పద్మాకమలాకర్ అన్నారు. ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు నేపథ్యంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు పలు సూచనలు చేశారు. పరీక్షల భయాన్ని తప్పించుకునేందుకు విద్యార్థులు తప్పటడుగుల వేస్తున్నారని, తానెంతో ఉల్లాసంగా ఉత్సాహంగా ఉన్నానని, తాను చదివిన మేరకు ఏం ఇచ్చినా రాయగలనని అనుకుంటూ పరీక్షలకు వెళితే బాగా రాయగలరన్నారు. తెలిసిన ప్రశ్నలకు ముందుగా సమాధానం రాయాలని, పరీక్ష రాసిన తర్వాత ఒక్కసారి పేపరు మొత్తం చూసుకోవాలన్నారు. పరీక్ష రాసి బయటకు వచ్చాక ఆ పరీక్ష కోసం ఆలోచించవద్దని, తదుపరి పరీక్షపై దృష్టి సారించాలని పద్మాకమలాకర్ చెప్పారు.

ఎన్నికల్లో పోటీ చేసేందుకు రండి..

అభ్యర్థులకు భారతీయ చైతన్య పార్టీ ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే నిజాయితీపరులకు, బీఆర్ అంబేడ్కర్, పూలే ఆశయాలతో ముందుకు సాగే వారిని తమ పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఆహ్వానిస్తున్నామని భారతీయ చైతన్య పార్టీ వ్యవస్థాపకుడు కట్టా కృష్ణ తెలిపారు. శాస్త్రీయ పద్ధతిలో పేదరికాన్ని నిర్మూలించడానికి, స్వశక్తిపై జీవించే విధంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు వాస్తవ కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామన్నారు. తమ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు కూడా తాము మద్దతు ఇస్తామన్నారు.

ఎన్నికల కోడ్‌తో మార్పు మొదలు

వైసీపీ దుష్టపాలనకు అంతిమ ఘడియలు

ఆదిరెడ్డి వాసు.. టీడీపీలో పలువురి చేరిక

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 16: కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిన ఎన్నికల కోడ్ అమలుతో రాష్ట్రంలో మార్పు మొదలైందని టీడీపీ-జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు అన్నారు. స్థానిక 41వ డివిజన్‌లో వైసీపీ నుంచి టీడీపీలోకి సుమారు 200మంది కార్యకర్తలు చేరారు. వారికి వాసుతోపాటు జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణలు పార్టీ కండువాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రాకతో రాష్ట్రంలో దుష్టపరిపాలనకు అంతిమఘడియలు ప్రారంభమయ్యాయన్నారు. అధికార పార్టీ దుర్మార్గాలు, దౌర్జన్యాలు, ప్రలోభాలకు తెరపడిందన్నారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, చంద్రబాబు పాలనలో ప్రజలు సుఖంగా స్వేచ్ఛాయుత వాతవరణంలో జీవించవచ్చన్నారు. అనుశ్రీ మాట్లాడుతూ భరత్‌రామ్‌కు పతనం కోటిలింగాలపేట నుంచే ఆరంభమైందన్నారు. హడావుడిగా పంపిణీచేసిన పట్టాలపై కమిషనర్ ముద్రలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ మర్రి దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బుడ్డిగ రాధా, బుడ్డిగ గోపాలకృష్ణ, బుడ్డిగ రవి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

హుకుంపేటలో మూడున్నర కిలోల వెండి చోరీ

రాజమహేంద్రవరం, మార్చి 16(ఆంధ్రజ్యోతి): హుకుంపేట వరలక్ష్మీ కాలనీకి చెందిన సత్యనారాయణ ఈ నెల 29న పెద్ద కొడుక్కి పెళ్లి చేశాడు. అతడు ముంబైలోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తుండడంతో కొత్త దంపతులను తీసుకొని ఈ నెల 14న సత్యనారాయణ కుటుంబం ముంబై వెళ్లింది. అయితే, 15న స్థానికులు సత్యనారాయణకు ఫోన్ చేసి ఇంటి తలుపులు తీసి ఉన్నాయని చెప్పారు. వెంటనే ఆయన బావమరిది సన్యాసిరావుకు ఫోన్ చేసి వెళ్లి చూడమనగా.. దొంగతనం జరిగిందని గుర్తించారు. ఆయన బొమ్మూరు పోలీసులను ఆశ్రయించారు. మూడున్నర కిలోల వెండి, కొంత నగదు దోచుకుపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎండీ ఉమర్ తెలిపారు.

వైసీపీకి మరో అవకాశమిస్తే..

రాష్ట్రం రావణ కాష్టమే : ముప్పిడి

కొవ్వూరు, మార్చి 16: వైసీపీకి మరో అవకాశమిస్తే రావణకాష్టంలా



పశివేదలలో ప్రచారం చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

మారుతుందని, అయినా సొంత చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి రాష్ట్రానికి ఏమి చేస్తాడని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవూరు మండలం పశివేదల, చాగల్లు, బ్రాహ్మణగూడెం గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించి స్థానిక నాయకులను కలిశారు. కొవ్వూరులో పరిమి రామారాయుడు రత్తమ్మ కల్యాణ మండపంలో బీజేపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు పెరిగిపోయాయని, పోలవరం, రాజధాని అమరావతి, మద్య నిషేధం ఇలా ఏ అంశంలో చూసినా సీఎం జగన్ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దింపేశారన్నారు. అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కి నెట్టేశారన్నారు. రాష్ట్ర, పిల్లల భవిష్యత్‌ను కాపాడుకోవాలంటే ఎన్డీయే నిలబెట్టిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా సైకోపై పోరాటం చేయాలన్నారు. జగన్ ప్రభుత్వాన్ని మూడు పార్టీలు కలిసి ఇంటికి పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బేతిన నారాయణ, గుర్రం దిలీప్‌కుమార్, గారపాటి రామచంద్రరావు, గారపాటి శ్రీనివాసరావు, వేటి లింగేశ్వరరావు, బీజేపీ నాయకులు పరిమి రాధాకృష్ణ, బీవీ ముత్యాలరావు, పిల్లలమర్రి మురళీకృష్ణ, ఎం.రామచంద్రరావు, నీరుకొండ సూర్యనారాయణ, ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, నాదెళ్ల శ్రీరామ్ పాల్గొన్నారు.

ధర్మన్న రచనలు సంఘసంస్కరణ దీప్తులు

నన్నయ ఉపకులపతి ఆచార్య పద్మరాజు

దివాన్‌చెరువు, మార్చి 16: శతాబ్దాల చరిత్ర గల సాంస్కృతిక రాజధానిలో



కుసుమధర్మన్న సాహిత్య పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ పద్మరాజు

సంఘ సంస్కరణదీప్తిగా కుసుమ ధర్మన్న రచనలు దశదిశలా వ్యాపించాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని కుసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో మహాకవి కుసుమ ధర్మన్న 125వ జయంతోత్సవంను శనివారం ఘనంగా నిర్వహించారు. నన్నయ తెలుగుశాఖ నిర్వహణలో తెలుగు జాతీయ సదస్సు, కవి సమ్మేళనం, కుసుమ ధర్మన్న సాహితీ పురస్కారాలు ప్రదానం కార్యక్రమాలు జరిగాయి. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ 1921 సంవత్సరంలో గరిమెళ్ల సత్యనారాయణ రాసిన మాకొద్దీ తెల్లదొరతనం గేయానికి భిన్నంగా నల్లదొరలు పాలన వచ్చినంత మాత్రాన హరిజనులకు ఒరిగేదేమీ ఉండదని నిర్మొహమాటంగా మా కొద్దీతెల్లదొరతనం ప్రతిగేయం రాసిన తొలిదళిత విప్లవ కవి ధర్మన్న అని కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద్ మూర్తి మాట్లాడుతూ ధర్మన్న సాహిత్యంతో సమాజాన్ని చైతన్యవంతం చేసిన విధానాలు తెలిపారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకర్ సామాజిక ఆత్మగౌరవం, చైతన్యం కుసుమ ధర్మన్న అనే అంశంపై ప్రసంగించారు. కుసుమ ధర్మన్న కళాపీఠం అధ్యక్షురాలు రాధా కుసుమ మాట్లాడుతూ రాజమహేంద్రవరానికి చెందిన ధర్మన్న విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయాలని కోరారు. ధర్మన్న కళాపీఠంచే సాహితీ సేవా పురస్కారాన్ని నన్నయ తెలుగుశాఖ అధ్యాపకుడు తరపట్ల సత్యనారాయణకు వీసీ ప్రదానం చేశారు. 40 మంది అధ్యాపకులు, పరిశోధకులు పత్రసమర్పణలతో ముద్రించిన పుస్తకాన్నీ వీసీ ఆవిష్కరించారు. కుసుమ ధర్మన్న సాహితీప్రస్థానం సామాజిక సేవ అనే అంశంపై జాతీయస్థాయిలో 53 మంది కవులు కవితాగానం చేశారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ప్రిన్సిపాల్ డి.జ్యోతిర్మయి, ఏయూ అసోసియేట్ ప్రొఫెసర్ బూసి వెంకటస్వామి, వీఎస్ఎం కళాశాల తెలుగుశాఖాధిపతి ర్యాలి శ్రీనివాసు, కందుకూరి వీరేశలింగం కళాశాల శాఖాధిపతి పీవీబీ సంజీవరావు, నన్నయ తెలుగుశాఖ కోర్సు కోఆర్డినేటర్ కేవీఎన్‌డీ వరప్రసాద్, అధ్యాపకులు తలారి వాసు, డి.లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

అనపర్తి టికెట్‌పై స్పష్టమైన ప్రకటన చేయాలి

నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు

అనపర్తి, మార్చి 16: వచ్చే సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ఇప్పటికే చంద్రబాబు మొదటి జాబితాలో ప్రకటన చేశారు. ఇటీవల టీడీపీ జనసేన పార్టీలతోపాటు బీజేపీ కూడా కలవడంతో సీట్ల సర్దుబాటులో అనపర్తి సీటు బీజేపీకి కేటాయిస్తారన్న వార్తల నేపథ్యంలో శనివారం అనపర్తి నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ అనపర్తి నియోజ కవర్గంలో గత ఐదు సంవత్సరాలుగా వైసీపీ చేస్తున్న అరాచకాలను ఎండకడుతూ అనేక అక్రమ కేసులు బనాయించిన పట్టువదలని విక్రమార్కుడిలా యుద్ధం చేస్తున్న నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని కాదని బీజేపీకి సీటు కేటాయిస్తారని జరుగుతున్న ప్రచారంపై అధిష్టానం స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు. అనపర్తి నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా నల్లమిల్లి గెలుపు దిశగా ఉన్నారన్నారు. జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు సత్తి దేవదానరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీలో ఉంటారని ఆయనే విజయం సాధిస్తారని కార్యకర్తలు అధైర్యప డొద్దని అన్నారు. బీసీ నాయకుడు రేలంగి నాగేశ్వరరావు మాట్లాడుతూ అనపర్తిలో నల్లమిల్లి మూలారెడ్డి కుటుంబానికి తిరుగులేదని, రామ కృష్ణారెడ్డి కాదని చంద్రబాబు బీజేపీకి సీటు ఇచ్చే ప్రసక్తిలేదని నియోజకవర్గంలో ఓటమి భయంతో వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. సమావేశం అనంతరం నాయకులు కార్యకర్తలు బైక్‌లతో ర్యాలీగా రామవరంలోని రామ నివాసానికి చేరుకుని ఆయనకు సంఘీభావం ప్రకటించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	ఆపరేషన్ వాలంటైన్
వై.స్క్రీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	గామి
అనన్య	భీమా

నిడదవోలు

వీ మ్యాక్స్	ప్రేమలు
రాధాకృష్ణ	భీమా
శ్రీగణపతి	వెయ్ దరువెయ్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి